ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152
షణ్ముఖ
SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers

PL.NO.IR/RNP/SV/26/2026
సంపుటి : 03 సంచిక : 220
గురువారం 20 ఆగస్టు 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## ఇంటింటికీ టీడీపీ.. 70 లక్షల ఇళ్లకు చేరువగా కార్యక్రమం

**24 రోజుల్లో దాదాపు 70 లక్షల కుటుంబాలను కలిసిన శ్రేణులు**
**ప్రభుత్వ పథకాలపై ప్రచారం, ప్రజాభిప్రాయ సేకరణ**
**ఒక్కరోజే 2.54 లక్షల కుటుంబాలతో టీడీపీ నేతల భేటీ**
**క్షేత్రస్థాయి స్పందనను నాయకత్వం దృష్టికి తీసుకెళ్తున్న కార్యకర్తలు**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 19)
తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం – రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహభరితంగా సాగుతోంది. ఈ కార్యక్రమం ప్రారంభమైన 24 రోజుల్లో పార్టీ శ్రేణులు మొత్తం 69.26 లక్షల కుటుంబాలను నేరుగా కలిశారు. బుధవారం 24వ రోజున తాజాగా మరో 2.54 లక్షల ఇళ్లను సందర్శించారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించడంతో పాటు క్షేత్రస్థాయిలో వారి అభిప్రాయాలను సేకరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇంటింటి పర్యటనల భాగంగా ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజలకు వివరిస్తూనే, వారు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలపై ఆరా తీస్తున్నారు.ప్రజల నుంచి వస్తున్న సూచనలు, సలహాలను పార్టీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు నమోదు చేసుకుంటూ, వాటిని స్థానిక ప్రజాప్రతినిధులు, ▶2లో



## ప్రైవేటు వర్సిటీల ఏర్పాటు సులభతరం....

### అసెంబ్లీలో సవరణ బిల్లు ప్రవేశపెట్టిన లోకేశ్

**ప్రైవేటు వర్సిటీల ఏర్పాటుపై నిబంధనలను సరళతరం చేస్తూ అసెంబ్లీలో బిల్లు**
**భూమి నిబంధన 50 నుంచి 10 ఎకరాలకు తగ్గింపు**
**కనీస పెట్టుబడి నిబంధన తొలగింపు, ఎండోమెంట్ ఫీజు రూ. 5 కోట్లకు కుదింపు**
**రాష్ట్రంలో 'విష్ణు మహిళా విశ్వవిద్యాలయం' ఏర్పాటుకు ఆమోదం**
**60 రోజుల్లోనే ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో వర్సిటీలకు అనుమతులు**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 19)
ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటు ప్రక్రియను సరళతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ మేరకు 'ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు 2026'ను విద్యా, ఐటీ శాఖ 2

## అక్టోబరులో 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాల్సిందే



**గడువులోగా జరగకపోతే 16వ ఆర్థిక సంఘం నిధులు కోల్పోతాం**
**ఇచ్చిన మాట ప్రకారమే బీసీలకు 34% రిజర్వేషన్లు**
**మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టీకరణ**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 19)
రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను అక్టోబరులో నిర్వహించాల్సిందేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్ల అంశంపై మంగళవారం మంత్రివర్గ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. గడువులోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే.. 16వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్రం కోల్పోతుందని తెలిపారు. 16వ ఆర్థిక సంఘం నిధులు ఐదేళ్లలో రాష్ట్రంలోని పంచాయతీరాజ్ సంస్థలకు సుమారు రూ.16,600 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రూ.12,150 కోట్లు రావాలంటే కచ్చితంగా ఎన్నికలు జరిగితీరాలని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి నగరపాలిక/పురపాలికకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. 2021లో సమీప గ్రామాల విలీన అంశంపై కోర్టు కేసుల కారణంగా ఎన్నికలు జరగని 23 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకూ ఈసారి ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. కేసులు వేసిన వారితో మాట్లాడి వాటిని ఉపసంహరించుకునేలా చేయాలని, లేనిపక్షంలో ప్రస్తుతానికి సమీప గ్రామాల విలీన ప్రక్రియను పక్కనపెట్టి ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. వైకాపా ప్రభుత్వం బీసీలకు 34% రిజర్వేషన్లు అమలుపరచకుండా, వారికి ద్రోహం చేసిందని మంత్రిమండలి ధ్వజమెత్తింది. 2024 ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన ▶2లో

## శాసనమండలిలో గందరగోళం.. వైకాపా సభ్యుల తీరుపై మంత్రుల ఆగ్రహం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 19)
మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని.. విచారణ జరిపించాలంటూ వైకాపా సభ్యుల ఆందోళనతో శాసనమండలి కార్యకలాపాలకు మూడోరోజు కూడా అంతరాయం కలిగింది. వైకాపా సభ్యుల తీరుపై మంత్రులు పార్థసారథి, నాందెడ్ల మనోహర్, అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను ఆర్డర్‌లో పెట్టాలంటూ మండలి ఛైర్మన్‌ని మంత్రులు కోరే సందర్భంలో కాసేపు వాడీవేడి చర్చ జరిగింది. మూడో రోజు సమావేశాలు ప్రారంభం కాగానే... మెగా డీఎస్సీ నిర్వహణపై విచారణ చేయాలంటూ వైకాపా సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని మండలి ఛైర్మన్ కె.మోషేను రాజు తిరస్కరించారు. ప్రశ్నోత్తరాలు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించగానే... సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగిస్తూ వైకాపా సభ్యులు నినాదాలు చేశారు. ఛైర్మన్ పోడియం వద్దకు వెళ్లి గందరగోళం సృష్టించారు. ఈ క్రమంలో మంత్రి కొలుసు పార్థసారథి జోక్యం చేసుకుని ▶2లో



## ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు పెరిగాయ్: లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 19)
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని విద్యాశాఖ మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఎయిడెడ్ పాఠశాలల మూసివేత, గత మూడేళ్లలో విద్యార్థుల నమోదుపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. '2025-26లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ప్రవేశాలు 41.40% నుంచి 2026-27 నాటికి 42.34%కి పెరిగాయి. దీనికి అనుగుణంగా ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ల శాతం తగ్గింది. గత రెండేళ్లలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలను మూసేయలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు 2022-23లో 7.6%, 2023-24లో 3.03%, 2024-25లో 3.24 శాతం తగ్గాయి. ఇవి గత వైకాపా ప్రభుత్వంలో జరిగాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవకతవకలను నివారించాం. నకిలీ డేటాను తొలగించాం' అని మంత్రి పేర్కొన్నారు.



## కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు.. విద్యార్థులు, యువత సమస్యలపై సీడబ్ల్యూసీలో కీలక చర్చ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 19)
ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఉన్నత విద్య సామాన్యులకు భారంగా మారుతోందని, ప్రముఖ విద్యాసంస్థలన్నీ క్రమంగా ఆర్ఎస్ఎస్ వ్యక్తుల చేతుల్లోకి వెళు న్నాయని ఆయన ఆరోపించారు. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు పేపర్ లీకేజీలు, రిక్రూట్‌మెంట్ పరీక్షల కుంభకోణాలే స్వాగతం పలుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, నిర్లక్ష్య వైఖరి వల్ల యువత రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. పార్లమెంట్ సమావేశాల్లో ▶2లో

## దళవాయి రమాదేవి ఎంపికతో బీసీలకు బలమైన రాజకీయ సందేశం!

**కష్టపడేవారికి గుర్తింపు ఉంటుందన్న సంకేతమన్న పార్టీ వర్గాలు**
**స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పునరుద్ధరించడంపై హర్షం**
**దళిత నాయకుడు వర్ల రామయ్యకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అవకాశం**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 19)
టీడీపీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్న సంకేతాన్ని దళవాయి రమాదేవి ఎంపిక ఇచ్చిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అనంతపురం జిల్లాకు చెందిన బీసీ మహిళా నాయకురాలు రమాదేవిని గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా ప్రతిపాదించడం ద్వారా క్షేత్రస్థాయి కార్యకర్తలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు పేర్కొంటున్నాయి.రమాదేవి డ్వాక్రా సంఘం అధ్యక్షురాలిగా, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేశారు. ▶2లో

## ఎన్నికలకు సిద్ధంకండి.. గెలుపే లక్ష్యంగా పని చేయండి

**రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ**
**కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్**
**రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 19)
కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, ▶2లో

## వెలిగొండ నిర్వాసితులకు సీఎం చంద్రబాబు భరోసా..



**మరో రూ.200 కోట్ల పరిహారం విడుదల**
**వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మరో రూ.200 కోట్ల పరిహారం**
**బాధితులకు శాసనసభ ప్రాంగణంలో చెక్కు అందించిన సీఎం చంద్రబాబు**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 19)
ఏడు పునరావాస కాలనీల్లో వేగంగా మౌలిక వసతుల కల్పన దశాబ్దాల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభానికి సమీపిస్తున్న వేళ, ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాలకు రాష్ట్ర ▶2లో



## కుమార్తె పొలిటికల్ ఎంట్రీపై కీలక ప్రకటన చేసిన బొత్స సత్యనారాయణ

**స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కూతురు పోటీ చేస్తుందన్న బొత్స**
**జిల్లా పరిషత్ ఎన్నికల్లో బరిలోకి దింపుతామని వెల్లడి**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 19)
తన కుమార్తె అనూష రాజకీయ అరంగేట్రంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కీలక ప్రకటన చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుమార్తె పోటీ చేస్తుందని ఆయన వెల్లడించారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో అనూషను బరిలోకి దించుతున్నట్లు స్పష్టం చేశారు.మరోవైపు, అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూటమి ప్రభుత్వంపై బొత్స తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శాసనసభలో కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా ▶2లో

మొదటిపేజీ తరువాయి

## ఇంటింటికీ టీడీపీ.. 70 లక్షల ఇళ్లకు చేరువగా కార్యక్రమం

పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వ విజయాలను ప్రజలకి తీసుకెళ్లడంతో పాటు, వారి అవసరాలను గుర్తించే పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి.ఇప్పటికే 60 లక్షల గృహాల సందర్శన మైలురాయిని దాటిన ఈ కార్యక్రమం, ప్రస్తుతం 70 లక్షల కుటుంబాల మార్కుకు చేరువ కావడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ప్రభుత్వ అభివృద్ధి ఫలాలను ప్రతి ఇంటికీ చేరవేస్తూ, ప్రజలతో నిరంతర సంబంధాలను కొనసాగించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్తున్నారు.
ఔష్ట్రూఫ్‌రాజూజూజూ

## దళవాయి రమాదేవి ఎంపికతో బీసీలకు బలమైన రాజకీయ సందేశం!

పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అలాంటి నాయకురాలికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం ద్వారా పార్టీ కోసం పనిచేసేవారికి పదవులు దక్కుతాయన్న సందేశం వెళ్లిందని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి.ఇదే సమయంలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పునరుద్ధరించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఒకవైపు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు.. మరోవైపు బీసీ మహిళా నాయకురాలికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం ద్వారా బీసీల రాజకీయ ప్రాతినిధ్యంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.అదే సమయంలో సీనియర్ టీడీపీ నేత, దళిత నాయకుడు వర్ల రామయ్యకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం కూడా సామాజిక ప్రాతినిధ్యంపై చర్చకు దారితీసింది. రమాదేవి, రామయ్య ఎంపికలు పార్టీ కోసం పనిచేసిన నేతలకు గుర్తింపు, సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## వెలిగొండ నిర్వాసితులకు సీఎం చంద్రబాబు భరోసా..

ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా పరిహారం అందించిన ప్రభుత్వం, తాజాగా మరో రూ.200 కోట్ల రూపాయల పరిహారాన్ని విడుదల చేసింది. ఈరోజు శాసనసభ ప్రాంగణంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా నిర్వాసిత కుటుంబాల ప్రతినిధులకు ఈ చెక్కును అందజేశారు. ఈ విడుదలతో కలిపి ఇప్పటివరకు వెలిగొండ నిర్వాసితులకు ప్రభుత్వం రూ.518 కోట్ల మేర పరిహారం అందించినట్లయింది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులు, నిర్వాసితుల త్యాగాలను ప్రభుత్వం ఎన్నటికీ మరవదని స్పష్టం చేశారు. “త్యాగం మీది, వారికి అండగా నిలవాల్సిన బాధ్యత మాది. వెలిగొండ నిర్వాసితులను గతంలో ఆదుకున్నది మా ప్రభుత్వమే, ఇప్పుడు కూడా అండగా నిలుస్తున్నాం. మిగిలిన పరిహారాన్ని కూడా వీలైనంత త్వరగా విడుదల చేస్తాం. మంచి చేసే ప్రభుత్వాలను ప్రజలు గుర్తించాలి” అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వం అండగా నిలిచి, తమకు భరోసా కల్పించడం పట్ల నిర్వాసిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రభుత్వానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని వారు తెలిపారు.

రూ.518 కోట్లకు చేరిన పరిహారం

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గ్రామాల్లోని నిర్వాసితులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో భరోసా కల్పిస్తోంది. ఇందులో భాగంగా, సొంతంగా ఇళ్లు నిర్మించుకున్న వారికి వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద పరిహారం చెల్లిస్తున్నారు. గతంలో 2,557 కుటుంబాలకు ఓటీఎస్ కింద రూ.318 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. తాజాగా మరో 1,600 కుటుంబాలకు రూ.200 కోట్లను అందించింది. దీంతో మొత్తం 4,157 నిర్వాసిత కుటుంబాలకు రూ.518 కోట్ల పరిహారం అందింది.పరిహారంతో పాటు పునరావాసంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నిర్వాసితుల కోసం మొత్తం 7 పునరావాస కాలనీలను అభివృద్ధి చేస్తుండగా, ఇప్పటికే వేములకోట మినహా మిగిలిన 6 కాలనీలలో మౌలిక సదుపాయాల పనులు పూర్తయ్యాయి. విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి అన్ని వసతులు కల్పించడంతో నిర్వాసిత కుటుంబాలు తమకు కేటాయించిన ఇళ్లకు తరలివెళ్తున్నాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు.. విద్యార్థులు, యువత సమస్యలపై సీడబ్ల్యూసీలో కీలక చర్చ

ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా యువత లేవనెత్తిన అసలైన సమస్యలకు సమాధానం చెప్పకుండా తప్పించుకున్నారని ఖర్గే విమర్శించారు. యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ ‘విద్య నుంచి ఉపాధి వరకు రోడ్‌మ్యాప్’ను రూపొందించాల్సి ఉందన్నారు. అలాగే అయోధ్య రామాలయం విరాళాల చోరీ వివాదంపై స్పందిస్తూ, నిధుల గోల్‌మాల్‌పై నిష్పాక్షిక విచారణ జరిపించి బాధ్యులను జవాబుదారీ చేయాలని డిమాండ్ చేశారు.

## కుమార్తె పొలిటికల్ ఎంట్రీపై కీలక ప్రకటన చేసిన బొత్స సత్యనారాయణ

వ్యవహరిస్తోందని, బయట మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. డీఎస్సీ అంశంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ చైర్మన్ ఎన్నిక సమయంలో అధికార పక్షం బయటకు వెళ్లడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని, రాష్ట్ర చరిత్రలోనే ఇదొక కొత్త విపరీత సంప్రదాయమని విమర్శించారు. ఐదు కోట్ల మంది ప్రజలకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## శాసనమండలిలో గందరగోళం.. వైకాపా సభ్యుల తీరుపై మంత్రుల ఆగ్రహం

మూడు రోజులుగా సభను జరగనీయటం లేదని.. అడ్డుకునే వారిని సస్పెండ్ చేసి బయటకు పంపించాలని కోరారు. వైకాపా సభ్యులు సభను గౌరవించటం లేదని, ఛైర్మన్ టేబుల్‌ను కొడుతూ నినాదాలు చేస్తున్నారని...ఆర్డర్లో పెట్టాలని మంత్రి నాదెండ్ల సూచించారు. మనోహర్ వ్యాఖ్యలపై ఛైర్మన్ మోషేను రాజు అసహనం వ్యక్తంచేస్తూ... సభా నిర్వహణ, నిబంధనల గురించి మీకు బాగా తెలుసన్నారు. చర్యలు ఎలా తీసుకోవాలో దాని ప్రకారం ముందుకెళ్లాలన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు జోక్యం చేసుకుని.. గత ప్రభుత్వంలో మీరు ఛైర్మన్ గా ఉన్నప్పుడు రెడ్ లైన్ గీసి.. విపక్షాల వాళ్లు గీత దాటి వస్తే సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా అలాగే చేసేందుకు మీకు అధికారాలున్నాయని స్పష్టం చేశారు. మూడు రోజులుగా సభకు అంతరాయం కలిగిస్తుంటే చర్యలు తీసుకోవచ్చన్నారు. వైకాపా సభ్యుల ఆందోళనతో మండలిని వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ మోషేను రాజు ప్రకటించారు.

## ప్రైవేటు వర్సిటీల ఏర్పాటు సులభతరం....

మంత్రి నారా లోకేశ్ బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. నిబంధనలను సరళతరం చేసి, ఉన్నత విద్యా రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం.

కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తిగా తీసుకొచ్చిన ‘జన్ విశ్వాస్’ విధానంలో భాగంగానే ఈ సవరణలు చేస్తున్నట్లు మంత్రి లోకేశ్ వివరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అన్ని రంగాలకు విస్తరింపజేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఉన్నత విద్యా రంగంలో నియంత్రణలను సులభతరం చేస్తున్నామన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో వర్సిటీల సంఖ్య తక్కువగా ఉందని, ఈ సవరణల ద్వారా కొత్త సంస్థలను ప్రోత్సహించవచ్చని తెలిపారు.ఈ బిల్లులో పలు కీలక సవరణలు ప్రతిపాదించారు. ప్రధానంగా, ప్రైవేటు వర్సిటీ ఏర్పాటుకు అవసరమైన భూమిని 50 ఎకరాల నుంచి సీఆర్డీఏ, విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి నగరాల్లో 10 ఎకరాలకు, ఇతర ప్రాంతాల్లో 15 ఎకరాలకు తగ్గించారు. కనీస పెట్టుబడి నిబంధనను పూర్తిగా తొలగించి, కేసును బట్టి నిపుణుల కమిటీ నిర్ణయం తీసుకునేలా మార్పు చేశారు. ఎండోమెంట్ ఫీజును రూ.5 కోట్లకు పరిమితం చేశారు. బ్రౌన్‌ఫీల్డ్ వర్సిటీగా మారాలంటే యూజీసీ నిబంధనల ప్రకారం కనీసం 3.01 సీజీపీఏ తప్పనిసరి చేశారు.ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలో రెండో మహిళా విశ్వవిద్యాలయంగా ‘విష్ణు మహిళా విశ్వవిద్యాలయం’ ఏర్పాటుకు మార్గం సుగమమైందని మంత్రి తెలిపారు. మా ప్రభుత్వ విధానం ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’ అని, దరఖాస్తుల ప్రక్రియను 60 రోజుల్లో పూర్తి చేసేలా ఫాస్ట్ ట్రాక్ విధానాన్ని ఆన్‌లైన్‌లో తీసుకొస్తున్నామన్నారు.రాష్ట్రంలో ఏర్పాటు కానున్న స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ వంటి 22 పారిశ్రామిక క్లస్టర్లకు అనుగుణంగా వర్సిటీలలో పరిశోధనలను ప్రోత్సహించడమే లక్ష్యమని లోకేశ్ పేర్కొన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా, పరిశ్రమలకు అనుసంధానంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే ఈ సవరణల ముఖ్య ఉద్దేశమని మంత్రి వివరించారు.

## అక్టోబరులో ‘స్థానిక’ ఎన్నికలు నిర్వహించాల్సిందే

హామీ మేరకు స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్లు అమలుచేయాలని నిర్ణయించింది.

నిత్యావసరాల ధరలపై దృష్టి సారించండి

ద్రవ్యోల్బణం పెరగటంతో నిత్యావసరాల ధరలు అదుపు తప్పుతున్నాయని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మంత్రులు, అధికారులను సీఎం ఆదేశించారు. సామాజిక మాధ్యమాల్లో ప్రతిపక్ష పార్టీ దురుద్దేశపూర్వకంగా చేస్తున్న విమర్శలను గట్టిగా తిప్పికొట్టాలని మంత్రులకు సూచించారు. అర్థంపర్థంలేని పేర్లు, బ్రాండ్‌లతో మద్యం మార్కెట్‌లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగ నియామకాల్లో అభ్యర్థులకు ఐటీలో నైపుణ్యాన్ని తప్పనిసరి చేయాలని తెలిపారు. ప్రతి పనికీ ఒక ఉద్యోగి ఉండాలనే విధానాన్ని పక్కనపెట్టాలని సూచించారు. పీఎం సేతు కార్యక్రమాన్ని ఇంటర్మీడియట్‌తో అనుసంధానించాలని చెప్పారు. విద్యుత్తుశాఖ బాగా పనిచేస్తోందని, విద్యుత్తు కొనుగోళ్లలో యూనిట్‌కు 23 పైసలు ఆదా చేసిందని ప్రశంసించారు. పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ కొత్త అవకాశాలను అన్వేషిస్తూ, ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నారని అభినందించారు. ‘మిగతావారూ స్ఫూర్తి పొందాలి. కొత్త అవకాశాలను సృష్టించుకోవాలి. జాప్యానికి తావివ్వకుండా రియల్‌టైమ్‌లో పనిచేయాలి’ అని సీఎం సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తన ప్రసంగం.. ప్రధాని ప్రసంగంతో 93% మ్యాచ్ అయిందని, మంత్రులు కూడా ఆ స్థాయికి రావాలని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం 200 గురుకులాలు అభివృద్ధి చేయాలని చెప్పారు. విశాఖలో రిలయన్స్ డేటా సెంటర్‌కు భారీగా నీరు అవసరమవుతుందని వైకాపా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు.

## ఎన్నికలకు సిద్ధంకండి.. గెలుపే లక్ష్యంగా పని చేయండి

కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు. వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

## ఒకే కుటుంబంలో ముగ్గురు చిన్నారులకు తలసేమియా కన్నీటి పర్యంతమైన కుటుంబం

ఒక బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రులు మరో ఇద్దరి ప్రాణాల కోసం పోరాటం

బోన్ మారో మార్పిడికి రూ.60 లక్షలు అవసరం

దాతల సహకారం కోరుతున్న నిరుపేద కుటుంబం



**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఆగస్టు 19)** తలసేమియా వ్యాధి ఒక కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. పెద్దారవీడు మండలం వైడిపాడు గ్రామానికి చెందిన కొటారు శ్యామ్ కుమార్-యేసు కరుణ దంపతుల ఐదుగురు సంతానంలో ముగ్గురు చిన్నారులకు తలసేమియా వ్యాధి సోకగా, ఇప్పటికే ఒక బిడ్డను కోల్పోయిన ఆ కుటుంబం ఇప్పుడు మరో ఇద్దరు పిల్లల ప్రాణాలను కాపాడుకునేందుకు ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తోంది.వ్యాధితో బాధపడుతున్న అనూష (13), హనోక్ (11) ప్రతి పది రోజులకు ఒకసారి రక్తం ఎక్కించుకుంటున్నారు. వారి చికిత్సకు నెలకు సుమారు రూ.40 వేల వరకు ఖర్చవుతోందని కుటుంబ సభ్యులు తెలిపారు. 2012 నుంచి ఇప్పటివరకు రూ.20 లక్షలకు పైగా వైద్య ఖర్చులు చేసినట్లు పేర్కొన్నారు.ఆర్థిక పరిస్థితి సహకరించక చికిత్స కొనసాగించలేక తమ పెద్ద కుమార్తె దీప్తిని కోల్పోయామని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రస్తుతం సున్నిపెంటలో కూలి పనులు చేస్తూ పిల్లల వైద్యం కోసం శ్రమిస్తున్నామని తెలిపారు. వైద్యుల సూచన మేరకు అనూష, హనోక్‌లకు బోన్ మారో మార్పిడి శస్త్రచికిత్స చేస్తే వ్యాధి నుంచి పూర్తిగా కోలుకునే అవకాశం ఉందని చెప్పారు. అయితే ఒక్కో శస్త్రచికిత్సకు రూ.30 లక్షల చొప్పున మొత్తం రూ.60 లక్షలు అవసరమవుతుండటంతో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, దాతలు, సేవా సంస్థలు ఆదుకోవాలని వేడుకుంటున్నారు. సహాయం చేయదలిచిన వారు ఫోన్ పే 9381711550, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కొటారు శ్యామ్ కుమార్, అకౌంట్ నెం. 20376748084 ఐఎఫ్ఎస్‌సీ : ఎస్‌బీఐఎన్0000750, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, కొటారు యేసు కరుణ, అకౌంట్ నెం. 581410051366428, ఐఎఫ్ఎస్‌సీ : యుబీఎన్‌వో ఏఎస్‌సీజీ 7999. నెంబర్లకు పంపగలరు.

## మానవత్వం చాటుకున్న పొదిలి పెన్షనర్ల సంఘం

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 19)**

పొదిలి గ్రామంలోని పొదిలెమ్మ గుడి దగ్గర నివాసముంటున్న కాసింబి అనే కార్మికురాలికి తల సేమియాతో బాధపడుతున్న పదియేండ్ల కుమారుడు ఉన్నాడు. కుమారుని వైద్య ఖర్చుల కొరకు ఏదైనా సహాయం చేయమని పెన్షనర్ల సమావేశమునకు వచ్చి




అభ్యర్థించారు. ఈ తరుణంలో పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి మదార్ వలి, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ డి ఎల్ నరసింహారావు మాట్లాడుతూ “ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న” అని, మానవసేవయే మాధవసేవ అనే నానుడి ఉంది గనుక అందరూ తగిన విధంగా సహాయం చేయండి అని కోరగా సమావేశమునకు వచ్చిన పెన్షనర్లు అందరూ కలసి రూ.20వేలు పోగు చేసి ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు వీరారెడ్డి, మదార్ వలి, డిఎల్ నరసింహారావు, బాదుల్లా, చిట్టెంశెట్టి సుబ్బారావు, కేజీ మోహన్‌రావు, గుంటగాని నాగేశ్వరరావు, దాసరి గురుస్వామి, డి దానమ్మ, చంద్రావతి, సువర్ణమ్మ, శారమ్మ, విజయలక్ష్మి, తదితర పెన్షనర్లు పాల్గొన్నారు.

## దయ్యాలు, భూతాలు అవకాశవాదుల సృష్టే దయ్యాలు ఉన్నాయని నిరూపిస్తే రూ.50 వేలు నగదు బహుమానం

### కంబాలపాడు ఘటన ను తీవ్రంగా ఖండించిన జనవిజ్ఞాన వేదిక

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 19)**

రెండు రోజుల క్రితం పొదిలి మండలం కంబాలపాడు గ్రామంలో దయ్యాల సంచరిస్తున్నాయని సోషల్ మీడియాలో వచ్చిన ఒక కథనానికి సంబంధించి అది అవకాశవాదుల, భూమాఫియా దార్ల సృష్టి అయి ఉండవచ్చని జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు వి మాలకొండారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కంబాలపాడు గ్రామంలో అర్ధరాత్రి అమావాస్య సందర్భంగా జెసిబితో పని చేస్తుండగా ఒక ఆడ దయ్యం వచ్చి సంచరించి బెదిరించినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోను తీవ్రంగా ఖండించారు. జన విజ్ఞాన వేదిక మార్కాపురం జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా ప్రజలను అజ్ఞానంలో ఉంచి సమాజంలో పెత్తనం చేస్తే కొందరు అవకాశవాదులు ఇటువంటి వాటి ప్రోత్సహిస్తూ ఉంటారని ప్రస్తుత సంఘటన కూడా అటువంటి కోవలోనే అవకాశవాదులు లేదా భూమాఫియా, గుప్తనిధుల కోసం తవ్వే ముఠా వాళ్ల పని ఉంటుందని అభిప్రాయపడ్డారు. దయ్యాలు ఉన్నాయని ఎవరైనా నిరూపిస్తే రూ.50 వేలు నగదు బహుమానం ఇస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. జెవివి జిల్లా పూర్వపు అధ్యక్షులు ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని మూఢ నమ్మకాలుగా మార్చి సొమ్ము చేసుకునే ఎత్తుగడలో భాగంగా ఇటువంటి ప్రచారాలను చేస్తూ ఉంటారని వాటిని నమ్మవద్దని ప్రజలకు హితో పలికారు. పొదిలి మండల గౌరవ సలహాదారు యలమందారెడ్డి మాట్లాడుతూ మారుతున్న ఆధునిక యుగంలో సోషల్ మీడియా, అజ్ఞానపు, అబద్ధపు ప్రచారాలకు వేదిక కావడం దురదృష్టమన్నారు. జేవివి జిల్లా గౌరవ అధ్యక్షులు దాసరి గురుస్వామి మాట్లాడుతూ కంబాలపాడు దయ్యం ప్రచారం పచ్చి బూటకమని మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఏఐ సృష్టి అయి ఉండవచ్చునని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు గోన శ్రీనివాసులు, సీఐటీయూ మార్కాపూర్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.




ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
20.08.26 బుధవారం


## ప్రజా సమస్యలకు అండగా
# పొదిలి వర్కింగ్ జర్నలిస్ట్ ప్రెస్‌క్లబ్

**నూతన తాత్కాలిక కార్యాలయ ప్రారంభ వేడుకలో వక్తలు**

**ఎమ్మెల్యే కందుల సూచనలతో త్వరలోనే శాశ్వత భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేస్తాం**

**తహశీల్దార్ ఎం వి కృష్ణారెడ్డి**

**పొదిలి నగర పంచాయతీ అభివృద్ధికి సహకారం అందించాలి**

**కమిషనర్ రామ్మోహన్‌రావు**

**పోలీసులు, మీడియా సమన్వయంతో సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతాం**

**ఎస్ఐలు సూరెడ్డి రాజేష్, శ్రీకాంత్**








**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 19)**

ప్రజా సమస్యలకు అండగా పొదిలి వర్కింగ్ జర్నలిస్ట్ ప్రెస్‌క్లబ్ నిలవాలని వక్తలు అభిప్రాయపడ్డారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన పొదిలి వర్కింగ్ జర్నలిస్ట్స్ ప్రెస్ క్లబ్ తాత్కాలిక భవన ప్రారంభోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక తహశీల్దార్ ఎంవి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి ప్రెస్ క్లబ్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు నర్రా వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షత వహించి ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ కమిషనర్ రామ్మోహన్‌రావు, పొదిలి, కొనకనమిట్ల ఎస్ఐలు సూరెడ్డి రాజేష్, శ్రీకాంత్, నాయకులు, దాతలు పొదిలి నగర పంచాయతీ క్లస్టర్ ఇన్‌ఛార్జి వరికుంట్ల అనిల్ (పండు), మాజీ శివాలయం కమిటీ ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, ప్రముఖ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హబీబుల్లా బేగ్, చాగంటి మాలకొండారెడ్డి, దాసరి గురుస్వామి, చిట్టంశెట్టి వెంకట కృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగించారు. మండల తహశీల్దార్ ఎం వి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సహకారంతో పొదిలి ప్రెస్ క్లబ్ స్వంత భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అతి త్వరలోనే మీకు అందజేస్తామని స్పష్టం చేశారు. గత 20 ఏళ్ళుగా ప్రెస్ క్లబ్ లేదన్నారు. నేడు మీడియా ప్రతినిధులు అందరూ కలిసికట్టుగా ఉండి ప్రెస్ క్లబ్ తాత్కాలిక భవనం ఏర్పాటు చేసుకోవడం శుభ పరిణామమన్నారు. నగర పంచాయతీ కమిషనర్ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మీడియా సహకారం ఉంటే పొదిలి నగర పంచాయతీ అభివృద్ధి సాధించడానికి ఎంతో సమయం పట్టదన్నారు. ప్రతి ఒక్క మీడియా మిత్రుడు తనకు సహాయ, సహకారాలు అందించాలని, తద్వారా పొదిలి అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు. ఎస్ఐలు రాజేష్, శ్రీకాంత్ లు మాట్లాడుతూ పోలీసులు, మీడియా సమన్వయంతో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. మీడియా మిత్రులు అందరూ కలిసి మెలసి ▶2లో








# మొదలైన మున్సిపల్ ఎన్నికల వేడి

**అభ్యర్థుల అన్వేషణలో ప్రధాన పార్టీలు**
**ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో ప్రజాదరణ ఉన్న వారే అభ్యర్థులు**
**ఖర్చుకు జంకుతున్న నేతలు**

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఆగస్టు 19)**

మున్సిపల్ ఎన్నికల వేడి మొదలైంది. అక్టోబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ మున్సిపల్ ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో జరగనున్నాయి. దీంతో ప్రధాన పార్టీలు జనాదరణతో పాటు ఆర్థిక, అంగ బలం ఉన్న నాయకులను ఎంపిక చేసేందుకు సన్నద్ధతమవుతున్నారు. కనిగిరి మున్సిపాల్టీ పరిధిలో 32 వార్డులున్నాయి. సుమారు 34 వేల మంది ఓటర్లు ఉన్నారు. బిసిలకు అర్బన్ ఏరియాలో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారు. కనిగిరి మున్సిపాల్టీలో 32 వార్డుల్లో 10 నుంచి 11 బిసిలకు, ఎస్సీ, ఎస్టీలకు 5, ఓసిలకు 16 స్థానాలు రిజర్వు కానున్నాయి. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఉండడంతో 16 మంది మహిళలు కౌన్సిలర్లుగా పోటీ చేసే అవకాశం ఉంది. రిజర్వేషన్ రోస్టర్ రాష్ట్రాన్ని యూనిట్ గా తీసుకోనుండడంతో రిజర్వేషన్ల పై ఆశలు పెట్టుకున్న నాయకులకు అడియాశలు అయ్యే అవకాశాలున్నాయి. కనిగిరి మున్సిపాల్టీ ఏర్పడిన తర్వాత రెండు సార్లు మున్సిపల్ ఛైర్మన్ పదవిని బిసిలకు కేటాయించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో షేక్ చిన్న మస్తాన్, వైసీపీ పాలనలో ప్రముఖ న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్‌లు, మున్సిపల్ ఛైర్మన్‌లుగా పని చేశారు. ఈ దఫా కనిగిరి మున్సిపాల్టీ ఓసి అయ్యే అవకాశాలు మెండుగా ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో కావడంతో సమర్ధవంతమైన నాయకుడితో పాటు ఆర్థిక, అంగ బలం ఉన్న నాయకుల కోసం ప్రధాన పార్టీలు అన్వేషిస్తున్నట్లు తెలుస్తుంది. అధికార కూటమి ప్రభుత్వం నుండి ఆర్యవైశ్యులలో బలమైన నాయకుడిని దింపాలనే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఓ సిండికేట్ వ్యాపారిని, ఓ ప్రముఖ వైద్యురాలి కుమారుడితో పాటు సింగిల్ విండో ఛైర్మన్‌లలో ఎవరో ఒకరిని బరిలోకి దింపాలనే ప్రయత్నాలు టీడీపీ చేస్తున్నట్లు తెలుస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే ఒప్పుకోనని, అందుకు ఇన్‌ఛార్జిలే బాధ్యత వహించాల్సి వస్తుందని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హెచ్చరించడంతో బలమైన అభ్యర్థి కోసం ఆ పార్టీ ప్రయత్నిస్తుంది. గత పాలకవర్గంలో వైస్ ఛైర్మన్‌గా పని చేసిన రెడ్డి సామాజికవర్గానికి చెందిన ఓ మహిళ నాయకురాలిని బరిలో నిలిపేందుకు ఆ పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. ప్రత్యక్ష ఎన్నికలు కావడం, మున్సిపల్ ఛైర్మన్ పదవికి ప్రత్యక్ష ఎన్నిక జరగనుండడంతో 32 వార్డుల్లో ప్రజాదరణ ఉన్న నాయకులను బరిలో దింపితేనే ఛైర్మన్ పదవి సులభంగా కైవసం చేసుకోవచ్చని ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్నారు. గత వైసీపీ పాలనలో మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ ప్రలోభాలకు, బెదిరింపులకు దిగిందని, ఇప్పుడు అదే పరిస్థితి కొనసాగే పరిస్థితులు కూడా లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు చర్చిస్తున్నారు. గత ఎన్నికల ▶2లో

# స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలి

**రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 19)**

స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర సచివాలయం నుంచి బుధవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల ఆధారంగా రిజర్వేషన్ సీట్లను నిర్ణయించాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, ▶2లో

# ఈ నెలాఖరులో వెలుగొండ ప్రాజెక్టు ద్వారా నల్లమల సాగర్‌కి కృష్ణా జలాలు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 19)**

వెలుగొండ ప్రాజెక్టు శంకుస్థాపన చేసింది సీఎం చంద్రబాబు నాయుడేనని, ప్రారంభోత్సవం చేస్తోంది చంద్రబాబు నాయుడేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం అసెంబ్లీ ▶2లో

**వెలుగొండ శంకుస్థాపన చేసింది చంద్రబాబు నాయుడే**
**ప్రారంభోత్సవం చేస్తోంది చంద్రబాబు నాయుడే**
**ప్రాజెక్టు పూర్తి చేయకుండా జాతికి అంకితం చేసిన ఘనత గొడ్డలి పార్టీదే**
**మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

# ప్రజా సమస్యలకు అండగా పొదిలి వర్కింగ్ జర్నలిస్ట్ ప్రెస్‌క్లబ్





















ఉంటూ ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. మిగిలిన వక్తలు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమైనదని కొనియాడారు. కేవలం వార్తల సేకరణకే కాకుండా, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ఒక బలమైన వేదికగా ఈ ప్రెస్ క్లబ్ నిలవాలని ఆకాంక్షించారు. జర్నలిస్టులు సమాజ హిత కోరి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. సీనియర్లు తమ సుదీర్ఘ అనుభవాలను పంచుకుంటూ, పత్రికా రంగంలోకి వస్తున్న జూనియర్ జర్నలిస్టులకు పలు విలువైన సూచనలు, సలహాలు అందించారు. అనంతరం గత 30 సంవత్సరాలకు పైగా జర్నలిస్టు వృత్తిలో ఉంటూ సేవలందించిన హబీబ్‌కు అధికారులు, నాయకులు, దాతలు శాలువాతో ఘనంగా సత్కరించారు. సాయంత్రం సమయంలో పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎం రాజేష్ కుమార్ ప్రెస్‌క్లబ్ వద్దకు చేరుకుని పలు సలహాలు, సూచనలు చేశారు. త్వరలోనే శాశ్వత భవనంలోకి వెళ్ళాలని ఆకాంక్షించారు. అదే విధంగా ప్రజలకు, అధికారులకు వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారనికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి శ్రీను, ఉపాధ్యక్షులు జి కిషోర్, కార్యదర్శి జెకె విశ్వనాథం, సహాయ కార్యదర్శి ఓబులశెట్టి రాధాకృష్ణదాస్, కోశాధికారి షేక్ ముల్లా హసన్‌వలి (బడే), గౌరవ సలహాదారులు షేక్ మదార్ వలి, కోవూరి శ్రీనివాసులు, సీనియర్ పాత్రికేయులు వేణు, వెంకటేశ్వరరెడ్డి, బాజీ, ప్రెస్ క్లబ్ భవన యజమాని సుబ్రహ్మణ్యం, పలువురు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. చివరగా కార్యక్రమానికి హాజరైన అధికారులు, దాతలను ప్రెస్‌క్లబ్ కమిటీ శాలువాతో ఘనంగా సత్కరించింది.

## మైదుకూరులో దారుణం గుర్తుతెలియని లారీ ఢీకొని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు దుర్మరణం

**భూమాయపల్లి వద్ద తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం**

**స్వగ్రామం పప్పనపల్లె నుంచి విధులకు వస్తుండగా విషాదం**

**మృతుడి కుమారుడు వెంకటేశు ఫిర్యాదుతో కేసు నమోదు**





**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 19)**

వైఎస్ఆర్ కడప జిల్లా మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుర్తుతెలియని లారీ ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొన్న ఘటనలో మైదుకూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న పసల వెంకటయ్య (59), తండ్రి రాజారత్నం, అక్కడికక్కడే దారుణంగా బలైపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మైదుకూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న పసల వెంకటయ్య రోజువారీ విధుల్లో భాగంగా తన స్వగ్రామమైన పప్పనపల్లె నుంచి మైదుకూరు పట్టణానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. తెల్లవారుజామున సుమారు 4:30 గంటల ప్రాంతంలో మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని భూమాయపల్లి వద్దకు రాగానే, వేగంగా వచ్చిన ఓ గుర్తుతెలియని లారీ ఆయన బైక్‌ను తీవ్రంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ చక్రాల కింద పడటంతో వెంకటయ్య మృతదేహం గుర్తుపట్టడానికి వీలు లేని విధంగా తీవ్రంగా ఛిద్రమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద అనంతరం లారీ డ్రైవర్ వాహనంతో సహా అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుమారుడు వెంకటేశు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై చిరంజీవి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన లారీని, డ్రైవర్‌ను గుర్తించేందుకు రహదారిపై ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. విధులకు వస్తూ మార్గమధ్యంలోనే కార్మికుడు దుర్మరణం చెందడంతో పప్పనపల్లె గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. మున్సిపల్ కార్మికులు, స్థానికులు వెంకటయ్య మృతికి సంతాపం ప్రకటించారు.

## ఘనంగా గోపికృష్ణ జన్మదిన వేడుకలు




**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 19)**

ఎడుక్విటీ సంస్థ జనరల్ మేనేజర్ సిహెచ్ గోపికృష్ణ పుట్టినరోజు వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య నిర్వాహకుడిగా వ్యవహరించిన సంస్థ సీటీవో రమేష్ కుమార్, అందరి సమక్షంలో గోపికృష్ణతో అతిపెద్ద కేక్‌ను కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాల్గొన్న వారందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ, గోపికృష్ణ నిండు నూరేళ్ల పాటు సంతోషకరమైన ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో తులతూగుతూ మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలలో కృష్ణమూర్తి, మంజునాథ, సతీష్, శ్రీ కుమార్,ముని రాజ లతో పాటు పలువురు సిబ్బంది హాజరై ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలి



బీసీ ఓటర్ల సర్వే సమర్థంగా పూర్తి చేయాలన్నారు. తదుపరి సీట్లను నిర్ధారించాలన్నారు. ఎన్నికల సామగ్రి కొనుగోలు చేపట్టాలన్నారు. రాష్ట్రం నుంచి ఎన్నికల సామాగ్రి కేటాయింపు ఉంటుందని, మిగతావి స్థానికంగా కొనుగోలు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. సమస్యాత్మక, తీవ్ర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందస్తుగా గుర్తించి, బందోబస్తు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు సమకూర్చుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని మందస్తుగానే ఏర్పాటు చేసుకోవాలని పలు సూచనలు చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలకాగానే అభ్యంతరాలు స్వీకరించి, తుది జాబితాకు చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు అనుసరించి గ్రామ పంచాయతీలలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పంచాయతీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ స్థానిక సభ్యుల ఎన్నికల ఏర్పాట్లకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు ఉత్పన్నంగాకుండా ప్రణాళికతో అధికారులు పనిచేయాల్సి ఉంటుందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జిల్లా సంయుక్త కలెక్టర్ కల్పనా కుమారి, డిపిఓ అనుపమ, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఈఓ బాలమ్మ, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మొదలైన మున్సిపల్ ఎన్నికల వేడి

సమయంలో మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ ఘట్టం సందర్భంగా జరిగిన గొడవకు సంబంధించిన వీడియోను టీడీపీ నాయకులు సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టు చేశారు.

**ఖర్చుకు జంకుతున్న నాయకులు....**

మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక ప్రత్యక్ష ఎన్నిక కావడంతో ఖర్చు తడిసిమోపెడవుతుందని ఛైర్మన్ పదవి ఆశించే వారు ఆందోళనతో ఉన్నారు. ఓటర్లకు డబ్బు పంచడంతో పాటు కౌన్సిలర్ అభ్యర్థులకు కూడా ఫండ్ ఇవ్వాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అంతే గాక ఇతరత్రా ఖర్చులు కూడా తడిసిమోపెడవుతాయనే భయంతో ఉన్నారు. వచ్చే ఏడాది ప్రారంభం నుండి కొత్త పాలక వర్గం పాలన కొనసాగించే అవకాశాలున్నాయి. 2029లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండడంతో అప్పుడు ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో పెట్టిన ఖర్చు పరిస్థితి ఏమిటనే సందిగ్ధంలో నాయకులున్నట్లు సమాచారం. అధికారం మారితే రెండేళ్ళే కదా పెత్తనం అని టీడీపీ టిక్కెట్ ఆశించే వారు అనుకుంటుండగా 2029లో అధికారం మారకపోతే పదవి ఉన్నా అధికారం చలాయించలేమన్న ఆలోచన వైసీపీ నాయకుల్లో ఉంది. ఈ ప్రత్యక్ష ఎన్నికలు ఇరు పార్టీల నాయకులను ఆలోచనలో పడే పరిస్థితులు ఉన్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ నాటికి ఇరు పార్టీల నేతలు జనాదరణ ఉన్న నాయకులనే అభ్యర్థులుగా ఎంపిక చేసి ఎన్నికల బరిలో నిలపడం ఖాయమనే చర్చ జరుగుతోంది. కాగా అధికార టీడీపీ మాత్రం రెండేళ్ళలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కనిగిరి రూపురేఖలు మార్చారని, విద్యావంతులైన పట్టణ ప్రజలు అభివృద్ధికి ఓటు వేస్తారని టిడిపి నాయకులు ఆశతో ఉండగా కనిగిరి వైసీపీ కంచుకోట అని పేదలు, ఇతర వర్గాల వారు వైసీపీ కి ఓటు వేస్తారన్న ఆశతో ఆ పార్టీ నాయకులున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మొదటగా మున్సిపల్ ఎన్నికలు జరగనుండడంతో ఇరు పార్టీలు ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం ఖాయమని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది.

## ఈ నెలాఖరులో వెలుగొండ ప్రాజెక్టు ద్వారా నల్లమల సాగర్‌కి కృష్ణా జలాలు



ప్రాంగణంలో వెలిగొండ నిర్వాసితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.200 కోట్ల పరిహారం చెక్కును అందజేశారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల 30 ఏళ్ల కలను సీఎం చంద్రబాబునాయుడు నిజం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రాజెక్ట్ పనులతో పాటు నిర్వాసితుల సమస్యలను కూడా పరిష్కరిస్తుందని చెప్పారు. అందులో భాగంగా తొలి విడత రూ.318 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. నేడు రెండో విడతగా మరో రూ.200 కోట్లు అందజేశామన్నారు. మిగిలిన రూ.400 కోట్లు నిర్వాసి తులకు త్వరలోనే చెల్లించి ఈ నెలలోనే నల్లమల్ల సాగర్‌కు నీరిస్తామన్నారు. వెలుగొండ నిర్వాసితులను గొడ్డలి పార్టీ దారుణంగా మోసగించిందని, పూర్తికాని ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన ఘనత ఆ పార్టీ నాయకుడికే చెల్లిందన్నారు. చెప్పినట్లే మార్కాపురం జిల్లా చేశామని, వెలుగొండకు శంకుస్థాపన చేసిన చంద్రబాబే తిరిగి ప్రారంభిస్తున్నారని మంత్రి స్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, ఒంగోలు, కందుకూరు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, దామచర్ల జనార్ధన్‌రావు, ఇంటూరి నాగేశ్వరరావు, బి ఎన్ విజయ్‌కుమార్, యర్రగొండపాలెం టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## మర్రిచెట్టు సంఘంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 19)

మండల పరిధిలోని కరేడు పంచాయతీ మర్రిచెట్టు సంఘం సంఘంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు బుధవారం గత రెండు సంవత్సరాలుగా నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం గురించి బూత్ నెంబర్ 234లో స్థానిక నాయకులు డోర్ టు డోర్ తిరుగుతూ ప్రజల సమస్యలు, కష్టసుఖాల గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. స్థానిక సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు కొనసాగుతామని తెలియజేస్తూ ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు(కో క్లస్టర్) కోమట్ల వెంకటరామిరెడ్డి బిఎల్ఎ, గుమ్మడి శ్రీనివాసులు, చేకూరి వెంకయ్య ఏకశిరి సుబ్బారావు, అబ్బూరి శివ, చేవూరి రమణమ్మ, అబ్బనీ ప్రసన్న, నంబూరి కోటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎల్ఓసి చెక్కు అందజేత



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 19)

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు ఆదేశాల మేరకు చిన్నగంజాం మండలం కొత్తపాలెం గ్రామపంచాయతీ లోని మూలగానివారిపాలెం గ్రామానికి చెందిన పిల్లి పోగు నాగేశ్వరావుకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినటువంటి ప్రతి పేదవాడికి వైద్య ఖర్చులు నేను తోడున్నానంటూ ప్రతి ఇంటి పెద్ద కొడుకుగా నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ బాధ్యతలో బాగంగా పిల్లి పోగు నాగేశ్వరావుకి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.1,00,500లు చెక్కు రావడం జరిగింది. ఈ చెక్కును బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి సయ్యద్ అబ్దుల్ కలాం ఆజాద్ చేతుల మీదుగా పిల్లి పోగు నాగేశ్వరావుకి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తపాలెం గ్రామపంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రేవు నాంచార్లు, రాజు ఉదయ భాస్కర్ రెడ్డి,పెద్ద సింగు ఏడుకొండలు, పత్తిపాటి నాగేశ్వరరావు, చేజర్ల రమణ, మున్నంవారిపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు కుక్కల వెంకటేశ్వర రెడ్డి, ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## చాపాడు ఎస్ఐ చిన్న పెద్దయ్యకు జిల్లా ఎస్పీ అభినందనలు ప్రశంసా పత్రం అందజేత



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 19)

కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో చాపాడు సబ్ఇన్స్పెక్టర్ ఎస్ఐ చిన్న పెద్దయ్య ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇటీవల కాలంలో తన పరిధిలోని కేసులను అత్యంత ప్రతిభావంతంగా, త్వరితగతిన ఛేదించి విశేష పనితీరు కనబరిచినందుకు గానూ ఆయనకు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం లభించింది. ఈ సందర్భంగా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతు కేసుల విచారణలో చురుగ్గా వ్యవహరిస్తూ, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడంలో ఎస్ఐ చిన్న పెద్దయ్య కనబరిచిన సమర్థతను, నిబద్ధతను అభినందించారు. జిల్లా ఎస్పీ నుండి ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల ఎస్ఐ చిన్న పెద్దయ్య హర్షం వ్యక్తం చేశారు. ప్రజా భద్రత, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో మరింత బాధ్యతాయుతంగా పనిచేసేందుకు ఈ పురస్కారం ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె ప్రకాష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ ఎన్ సుధాకర్, మైదుకూరు డిఎస్పీ జి రాజేంద్ర ప్రసాద్, సబ్ డివిజన్ల సిఐలు, ఎస్ఐలు పాల్గొని చాపాడు ఎస్ఐ చిన్న పెద్దయ్యకు అభినందనలు తెలియజేశారు.

# దళితవాడల్లో మౌలిక వసతులు కల్పించాలి

# కులవివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించాలి

## ఆగస్టు 20, 21 తేదీల్లో బైక్, జూలై యాత్రలకు పిలుపు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 19)

"కులవివక్ష లేని సమాజం కోసం" నిర్వహిస్తున్న సామాజిక శంఖారావం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో దళితవాడల్లో నిర్వహించిన అధ్యయన యాత్రల్లో వెలుగులోకి వచ్చిన సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు రూపొందించిన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. కులవివక్ష, అంటరానితనం నిర్మూలనతో పాటు దళితవాడల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సామాజిక శంఖారావం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 18 మండలాలు, 67 గ్రామాలు, 3 పంచాయతీలు, 16 వార్డులకు చెందిన 131 దళితవాడల్లో అధ్యయనం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ అధ్యయనంలో దళితవాడల్లో అనేక తీవ్రమైన సమస్యలు తమ దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు. అధ్యయనంలో గుర్తించిన సమస్యల్లో 40 ప్రాంతాల్లో స్మశాన సమస్యలు, 30 ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల సమస్యలు, 13 ప్రాంతాల్లో భూ సమస్యలు, 32 ప్రాంతాల్లో మంచినీటి సమస్యలు, 32 ప్రాంతాల్లో రోడ్లు, లింకు రోడ్ల సమస్యలు, 22 ప్రాంతాల్లో విద్యుత్, విద్యుత్ స్తంభాల సమస్యలు, 14 ప్రాంతాల్లో స్మశాన వాటిక సమస్యలు, 14 ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల సమస్యలు ఉన్నట్లు తెలిపారు. వీటితో పాటు డ్రైనేజీ, పారిశుద్ధ్యం, అంగన్వాడీ కేంద్రాలు, వైద్యం, విద్యుత్ బకాయిలు, భూమి, ఇళ్ల స్థలాలు, ఉపాధి వంటి అనేక సమస్యలు ప్రజలను తీవ్రంగా వేధిస్తున్నాయని వివరించారు.

**దళితవాడల్లో మౌలిక వసతులు ఎందుకు లేవు?**

రాజ్యాంగం అమల్లోకి వచ్చి దశాబ్దాలు గడిచినా దళితవాడల్లో కనీస మౌలిక వసతులు కూడా పూర్తిస్థాయిలో అందకపోవడం బాధాకరమని నాయకులు అన్నారు. గ్రామాలకు అభివృద్ధి పథకాలు వస్తున్నప్పటికీ దళితవాడలకు మాత్రం వాటి ఫలాలు అందడం లేదని విమర్శించారు. దళితవాడల్లో పక్కా రోడ్లు, డ్రైనేజీలు, మంచినీరు, వీధి దీపాలు, విద్యుత్ సౌకర్యం, స్మశాన వాటికలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ భవనాలు వంటి ప్రాథమిక సౌకర్యాలను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు.

**భూమి లేకుండా అభివృద్ధి ఎలా?**

దళితులకు భూమి, ఇళ్ల స్థలాలు లేకపోవడం కూడా ప్రధాన సమస్యగా ఉందని తెలిపారు. ప్రభుత్వం భూమిలేని దళిత కుటుంబాలకు భూమి పంపిణీ చేయాలని, ఇళ్ల స్థలాలు లేని కుటుంబాలకు వెంటనే స్థలాలు కేటాయించాలని కోరారు. జి.ఓ. నెం.1235 ప్రకారం ప్రతి దళితవాడకు రెండు ఎకరాల భూమిని స్మశాన వాటిక కోసం కేటాయించి, స్మశాన వాటికల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. స్మశాన వాటికలకు ప్రహారీ గోడలు, రోడ్లు, ఇతర అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.

**భూమి హక్కులపై ప్రత్యేక దృష్టి**

దళితుల భూములను ఆక్రమణల నుంచి రక్షించాలని, ప్రభుత్వ భూములు, పోరంబోకు భూములు, ఎండోమెంట్ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని నాయకులు కోరారు. దళితుల భూములపై జరిగే ఆక్రమణలు, వివక్షను అరికట్టి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**కులవివక్ష, అంటరానితనం నిర్మూలించాలి**

దళితులకు రాజ్యాంగం హక్కులు కల్పించినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కులవివక్ష, అంటరానితనం కొనసాగడం సిగ్గుచేటని అన్నారు. దళితులు ఎదుర్కొంటున్న వివక్షపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి గ్రామంలో కులవివక్షకు వ్యతిరేకంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దళితవాడల్లోని సమస్యలను కేవలం ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం మాత్రమే కాకుండా, వాటి పరిష్కారం కోసం ప్రజలను సమీకరించి ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

**విద్య, ఉపాధికి ప్రాధాన్యత ఇవ్వాలి**

దళిత పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, అవసరమైన చోట కొత్త పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించి పిల్లలకు పోషకాహారం అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు చేసిన కార్మికులకు బకాయిలను వెంటనే చెల్లించాలని, గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. దళిత యువతకు విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**విద్యుత్, మంచినీటి సమస్యలు పరిష్కరించాలి**

దళితవాడల్లో విద్యుత్ బకాయిల పేరుతో కనెక్షన్లు తొలగించడం సరికాదని, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ప్లాన్ నిధులను పటిష్టంగా అమలు చేసి దళితవాడల్లో మంచినీరు, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, వీధి దీపాలు, కమ్యూనిటీ హాళ్లు తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

**దళిత మహిళల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ**

దళిత మహిళలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిష్కరించాలని అన్నారు. మహిళలకు రక్షణ, ఉపాధి, విద్య, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ప్రధాన డిమాండ్లు**

జిల్లాలో ప్రతి దళితవాడకు రెండు ఎకరాల స్మశాన భూమి కేటాయించి, జి.ఓ. నెం.1235ను అమలు చేయాలి. ఎస్సీ, ఎస్టీ సబ్ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి దళితవాడల్లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, వీధి దీపాలు, కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలి. దళితవాడల్లో మూసివేసిన ప్రాథమిక పాఠశాలలను పునరుద్ధరించాలి. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాలి. దళిత యువతకు స్వయం ఉపాధి కల్పించాలి. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి. దళితులను కించపరిచే విధంగా ఉన్న వివక్షను అరికట్టి, కులవివక్షకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవాలి. కాలనీలలో నివాసాల రక్షణ కోసం చర్యలు తీసుకుని, పట్టాలు లేని కుటుంబాలకు పట్టాలు ఇవ్వాలి. బాలికలకు హాస్టళ్ల సౌకర్యం కల్పించి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సర్కిళ్లను బలోపేతం చేయాలి. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి. కోనేరు రంగారావు కమిషన్ సిఫార్సులను అమలు చేసి, భూమి లేని ప్రతి కుటుంబానికి భూమి ఇవ్వాలి. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. దళిత ఉద్యోగులకు, చేనేత కార్మికులకు, చెప్పులు కుట్టుకునే వారికి పూర్తిస్థాయిలో రక్షణ, సంక్షేమ సౌకర్యాలు కల్పించాలి. దళితుల ఇళ్లకు పెండింగ్లో ఉన్న విద్యుత్ బిల్లులను పరిష్కరించి, విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలి. కులవివక్ష రూపాలను నిర్మూలించి, జె.పంగులూరు మండలం నూజిళ్ళపల్లి వంటి గ్రామాల్లో దళితవాడలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి. దళిత కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి, అర్హులైన కుటుంబాల బకాయిలను పరిష్కరించాలి. తదనంతరం నాయకులు మాట్లాడుతూ ఈ సమస్యలు ఒక్క గ్రామానికో, ఒక్క మండలానికో పరిమితమైనవి కావని, జిల్లావ్యాప్తంగా దళితవాడల్లో కనిపిస్తున్న సమస్యలని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రతి దళితవాడలోని సమస్యను గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కులవివక్షకు వ్యతిరేకంగా, సమానత్వం కోసం, సామాజిక న్యాయం కోసం ప్రజలను చైతన్యపరిచేందుకు ఆగస్టు 20, 21 తేదీల్లో నిర్వహించే బైక్ యాత్రలు, ప్రచార కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన ప్రజలను కలుపుకొని కులవివక్ష లేని సమాజం కోసం సామాజిక శంఖారావాన్ని మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

**కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు**

లివ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి కంకణాల ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.జి. మస్తాన్, జిల్లా కార్యదర్శి నేరుసు వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రఘురామ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం. రమేష్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి. బాలకోటయ్య, రైతు సంఘం నాయకులు శ్రీకాంత్, ఆవాజ్ నాయకులు హుస్సేన్, సి.హెచ్. మజుందార్, బంకా సుబ్బారావు, ఉబ్బా ఆదిలక్ష్మి, కంకణాల వెంకటేశ్వర్లు, పిల్లాపల్లి ఆంజనేయులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోణసపూడిలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 19)

మండలంలోని గోణసపూడి గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్ అధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి అద్దేపల్లి లక్ష్మి, చీరాల సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి హాజరై రైతులకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్నినో ప్రభావం, ఆరుతడి పంటల సాగు, ఎరువుల వినియోగం మరియు వ్యవసాయ శాఖ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి అద్దేపల్లి లక్ష్మి మాట్లాడుతూ, ప్రస్తుతం ఎల్నినో ప్రభావం డిసెంబర్ నెల వరకు కొనసాగుతున్నందున వర్షపాతం మరియు ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి లభ్యతను బట్టి పంటల ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.ముఖ్యంగా నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలైన జొన్న, కొర్ర మరియు ఇతర చిరుధాన్యాల సాగును ప్రోత్సహించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగలిగే చిరుధాన్యాలు మరియు ఆరుతడి పంటలను ఎంచుకోవడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల కలిగే పంట నష్టాలను కొంతవరకు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఎడిఎ రత్నకుమారి మాట్లాడుతూ రైతులు ఎరువులను పంట అవసరాలకు అనుగుణంగా మరియు శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా అధిక మోతాదులో యూరియా వినియోగించకుండా, నేల పరీక్షల ఆధారంగా సిఫార్సు చేసిన మోతాదులో సమతుల్య ఎరువులను వినియోగించాలని తెలిపారు. దీనివల్ల సాగు ఖర్చులు తగ్గడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. అలాగే ఏపిఏఐఎంఎస్ ద్వారా ఎరువుల పంపిణీ, విక్రయాల నమోదు విధానం గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు అవసరమైన ఎరువులు సక్రమంగా, పారదర్శకంగా అందేలా ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ ఇన్పుట్స్ లభ్యత గురించి రైతులకు వివరించారు. రైతులు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోణసపూడి గ్రామ రైతులు, రైతు సేవా కేంద్రం అసిస్టెంట్ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.





## పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఈఓ సామ సుబ్బారావు





(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగస్టు 19)
మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మార్కాపురం జిల్లా విద్యాశాఖాధికారి సామ సుబ్బారావు బుధవారం ఆకస్మికంగా మధ్యాహ్నం భోజన సమయంలో సందర్శించి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజనం పథకాన్ని స్వయంగా పరిశీలించి విద్యార్థులతో కొంత సేపు ముచ్చటించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనును సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలోని విద్యార్థులకు రాధాకృష్ణన్ మిత్ర పంపిణీ పై ఆరా తీశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఏ విధంగా విద్యను బోధిస్తే విద్యార్థులు విద్య పట్ల మక్కువ ఎక్కువ చూపి విద్యలో రాణిస్తారో అన్న అంశం పై ఉపాధ్యాయులకు అమూల్యమైన సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. పాఠశాలలో సెల్ఫ్ అసిస్మెంట్ మోడల్ పేపర్ 1 పరీక్ష అమలు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అంతే కాక పాఠశాలలో అమలు చేస్తున్న రికార్డులన్నింటినీ పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై శ్రీనివాసరావు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, సిఆర్ఎంటి గోసు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయపరమైన సమస్యలు ఉంటే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తాత్కాలిక కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సిహెచ్వి రామకృష్ణ**






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 19)
ఒంగోలు పట్టణంలోని జిల్లా జైలును బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తాత్కాలిక కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సిహెచ్ వి రామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలకు కల్పిస్తున్న వసతి, భోజనం తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. జైలులో విచారణలో ఉన్న ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలను తెలుసుకున్నారు. న్యాయ సహాయం అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని, అర్హత కలిగిన ఖైదీలు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదుల సహాయం పొందవచ్చని వివరించారు. అలాగే తమ కేసులకు సంబంధించి న్యాయపరమైన సమస్యలు ఉంటే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి వీర రాఘవులు, న్యాయవాదులు ఎం సింగయ్య, ధనలక్ష్మి, ముబీనా, న్యాయ సేవా సహాయకులు పి శ్రీనివాసులు, కుమారస్వామి, జైలర్ మజ్జి అప్పలనాయుడు, జిల్లా జైలు వైద్యురాలు డాక్టర్ సునీత, జైలు శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రైతులకు బోర్డు విజ్ఞప్తి
## 2020-2027 సంవత్సరానికి
## ఎఫ్‌సివి పొగాకు పంట నియంత్రణ యొక్క ఆవశ్యకత
## పరిమిత సాగుతోనే మేలైన ధరలు




(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 19)
భారతదేశం ప్రపంచంలో ఎఫ్‌సివి పొగాకు ఉత్పత్తిలో 4వ స్థానం, ఎగుమతిలో 2వ స్థానంలో ఉంది. ప్రపంచ దేశాలలో పొగాకు ఉత్పత్తి 3760 మిలియన్ కేజీల నుండి 4253 మిలియన్ కేజీలకి పెరిగిన కారణంగా, మరీ ముఖ్యంగా బ్రెజిల్, జింబాబ్వేలో అధిక పొగాకు ఉత్పత్తి కారణంగా, ప్రస్తుతం మన రైతులు తాము పండించిన పొగాకును మంచి ధరలకు అమ్ముకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున ఈ సంవత్సరం రైతులు విధిగా పొగాకు పంట నియంత్రణ పాటించి, నాణ్యత పెంపుదలపై దృష్టి సారించవలెను. రైతులు తమకు కేటాయించిన పరిమాణమునకు లోబడి మాత్రమే సాగు చేయవలసినదిగా విజ్ఞప్తి చేయడమైనది. పొగాకు బోర్డు యొక్క 168వ సమావేశంలో, దేశీయంగా, విదేశాలలో ఖీజఎ పొగాకుకు గల గిరాకీని మరియు మార్కెట్ లో ప్రస్తుతం ఉన్న నిల్వలను దృష్టిలో పెట్టుకుని, ఆంధ్రప్రదేశ్ లో 2026-27 పంట కాలమునకు 81.02 మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతించడమైనది. ప్రాంతాల వారిగా ఈ క్రింది విధంగా వంట పరిమాణం నిర్ణయించడమైనది. ఈ సందర్భంగా బుధవారం స్థానిక పొగాకు బోర్డులో జరిగిన సమావేశంలో వేలం నిర్వహణాధికారి కె రాజగోపాల్ మాట్లాడుతూ నాణ్యమైన దిగుబడి సాధించడమే లక్ష్యంగా ఉత్తమ వ్యవసాయ పద్ధతులు పాటించాలని రైతులకు పిలుపునిచ్చారు. డిమాండ్, సరఫరాల సమతుల్యత దెబ్బతింటే అది అంతిమంగా రైతుల రాబడి పైనే ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వివిధ ఆర్థిక సహాయాలను ప్రభుత్వం భారీగా పెంచినట్లు అధికారులు తెలిపారు. సహజ మరణ గ్రాంటు, బాలికల వివాహ సాయం, షెడ్డు మరమ్మతు రుణం, ప్రధాన శస్త్రచికిత్స రుణం, విద్యా రుణం ఇవన్నీ గతంలో ఉన్న రూ.50,000 నుండి రూ.1,00,000 కు పెంచబడ్డాయన్నారు. ప్రమాదవశాత్తు మరణ గ్రాంటు రూ.1,00,000 నుండి రూ.2,00,000 కు పెంచారని తెలిపారు. క్యూరింగ్ సమయంలో పొగాకు నష్టం, బార్న్ ఇన్సూరెన్స్, బల్క్ ఇన్సూరెన్స్ ద్వారా భద్రత పొందడానికి రైతులు సమ్మతి పత్రాలను వెంటనే అందజేయాలని సూచించారు. గత ఏడాదితో 2025-2026 ముగిసిన లైసెన్సులను, మూడేళ్ల 2026 - 2027, 2027 - 2028 బ్లాక్ కాలానికి అనుగుణంగా బోర్డు కార్యాలయంలో పునరుద్ధించు కోవచ్చు అని తెలిపారు. 2026-2027 పంట కాలానికి దక్షిణ తేలిక నేలలు బర్న్ కు ఆమోదించిన కోట 2100 కేజీలు అందుకు అనుమతించిన సాగు విస్తీర్ణం 3.5 ఎకరాలు దయచేసి దాని నుంచి సాగు చేయవద్దని తెలిపారు. పొగాకు బోర్డులో రిజిస్ట్రేషన్ కాబడిన రైతులు మాత్రమే పొగాకు పంట సాగు చేపట్టాలి రిజిస్ట్రేషన్ కానీ రైతులు ఎట్టి పరిస్థితులను పొగాకు పంట సాగు చేయవద్దు రైతుల తమ కేటాయించిన కోట మేరకు పండించాలి ఏ పరిస్థితుల్లోనూ అధిక విస్తీర్ణం నాటడం అధికంగా పండించడం చేయరాదు. కార్యక్రమంలో హెచ్‌పి బసవరాజు, ఫీల్డ్ ఆఫీసర్ ఉన్నం శ్రీనివాసులు, జిపిఐ కంపెనీ మేనేజర్, ఫీల్డ్ అసిస్టెంట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట
### పేకాట స్థావరం పై ప్రకాశం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు
### పేకాట ఆడుతున్న ముగ్గురు అరెస్ట్
### రూ.28,420 నగదు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 19)
ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఒంగోలు టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి దాడులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇనమనమేళ్లూరు పంచాయతీ గ్రామ శివారులో తేదీ 19.08.2026 సాయంత్రం టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్ సీఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ సి. చెంచయ్య, సిబ్బంది పేకాట స్థావరంపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడులో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.28,420 నగదు, 3 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని, స్వాధీనం చేసుకున్న నగదు, మొబైల్ ఫోన్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ ఘటనపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా పేకాట, జూదం లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే, ప్రజలు వెంటనే డయల్ 112కు లేదా పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా సమాచారం అందించాలని పోలీసులు కోరారు. ప్రజలు అందించే సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



## వినికిడి లోపంతో బాధపడుతున్న వ్యక్తికి వినికిడి పరికరం అందజేత



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 19)
శారీరక అంగవైకల్యంలో భాగంగా వినికిడి లోపంతో బాధపడుతున్న చిన్నమనగుండం గ్రామానికి చెందిన గుంటూరు బాలకాశయ్యకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో బుధవారం వినికిడి పరికరాన్ని అందజేశారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఏ. సత్యానంద్ బాలకాశయ్యకు వినికిడి పరికరాన్ని తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అవసరమైన న్యాయ సహాయం, సంక్షేమ సేవలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తాత్కాలిక కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ న్యాయమూర్తి సిహెచ్‌వి రామకృష్ణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్ చరిత్రాత్మకం
### బీసీల రాజకీయ సాధికారతకు ఇది కీలక ముందడుగు
### ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 19)
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ సాధికారత అనే లక్ష్యాలకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో తీసుకున్న ఈ నిర్ణయం మరింత బలం చేకూరుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. మొదటి నుంచీ తెలుగుదేశం పార్టీ బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ, వారి అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీసీల రాజకీయ సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వారి చిరకాల ఆకాంక్షను నెరవేర్చే దిశగా ఒక చరిత్రాత్మక అడుగని చెప్పారు. రాష్ట్ర జనాభాలో బీసీలు గణనీయమైన సంఖ్యలో ఉన్నప్పటికీ, గతంలో స్థానిక సంస్థల్లో వారికి ఆశించిన స్థాయిలో రాజకీయ ప్రాతినిధ్యం లభించలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు బీసీలకు పాలనలో మరింత భాగస్వామ్యం కల్పించే అవకాశం ఏర్పడిందన్నారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, ఇతర స్థానిక సంస్థల్లో బీసీ వర్గాలకు చెందిన ప్రజలు ప్రజాప్రతినిధులుగా ఎన్నికై తమ ప్రాంతాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించేందుకు ఈ రిజర్వేషన్ దోహదపడుతుందని తెలిపారు. బీసీలకు కేవలం రాజకీయ రిజర్వేషన్ కల్పించడం మాత్రమే కాకుండా, వారి విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సంక్షేమం కోసం కూడా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

## పెదారికట్ల, కంభాలపాడు గ్రామాలలో ఎయిడ్స్ అవగాహన సదస్సు





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 19)
ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలు మేరకు ప్రపంచ యూత్ ఫెస్టివల్ సందర్భంగా ఆగస్టు 12 తేదీ నుంచి అక్టోబర్ 12 వరకు కన్నా కళాబృందం కళాజాత ప్రోగ్రాం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది .అందులో భాగంగా కంబాలపాడు ,పెదారికట్ల గ్రామాలు నందు హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన లింక్ వర్కర్ స్కీమ్ సూపర్వైజర్ భాస్కర్ ఆధ్వర్యంలో కన్నా కళాబృందం కళాజాత ప్రోగ్రాం వారిచే ఆట పాటలా ద్వారా నాటక ప్రదర్శనలు బస్టాండ్ సెంటర్లో నిర్వహించారు. హెచ్ఐవి అనేది 4 మార్గాల ద్వారా ఒకరి నుండి మరొకరికి సంక్రమిస్తుందని, సురక్షితం గాని సూదుల సిరంజీల ద్వారా, సురక్షితంగా అని రక్త మార్పిడి ద్వారా, సురక్షితంగా అని లైంగిక సంబంధాల ద్వారా, హెచ్ఐవి ఉన్న గర్భవతి అయిన తల్లి నుండి బిడ్డకు సంక్రమిస్తుందని నాటక ప్రదర్శన ద్వారా కరపత్రాలు ద్వారా, హెచ్ఐవి బాధితుల చట్టం 2017 టోల్ ఫ్రీ నెంబర్ 1097 పై ప్రజలకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్ స్కీమ్ సూపర్వైజర్ భాస్కర్, లింక్ వర్కర్స్ గాంధీ, చైతన్య ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## దశదిన కార్యక్రమంలో పాల్గొన్న దామచర్ల సత్య



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఆగస్టు 19)
మండలంలోని ఉప్పలదిన్నె గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కొండ శ్రీనివాసరావు మాతృమూర్తి ఇటీవల మృతి చెందగా ఆమె దశదిన కార్యక్రమంలో బుధవారం రాష్ట్ర మారీ టైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య తులసమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మండల టిడిపి నాయకులు మండవ ప్రసాద్, గుమ్మల్ల వెంకట్రావు, అనుమోలు సుధాకర్ బాబు, మండవ మురళీమోహన్, కొండ్రగుంట నరసయ్య, పి కృష్ణమూర్తి, ఏలూరు రాంబాబు, పాతూరి కోటయ్య, తదితరులు ఉన్నారు.

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**మైదుకూరు అంకాలమ్మ ఆలయంలో నివాళులర్పించిన ఫోటో స్టూడియో యాజమాన్యాలు**



**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 19)**

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మైదుకూరు నియోజకవర్గ ఫోటోగ్రాఫర్లు, ఫోటో స్టూడియో యజమానులు సోమవారం స్థానిక అంకాలమ్మ దేవి ఆలయ ప్రాంగణంలో వేడుకలను అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఫోటోగ్రఫీ రంగానికి ప్రాణం పోసిన పితామహుడు, డాగురియోటైప్ ప్రక్రియ సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలదండలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కళాకారులు, సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో మధుర జ్ఞాపకాలను, ముఖ్యమైన ఘట్టాలను శాశ్వతంగా భద్రపరిచే గొప్ప వృత్తి ఫోటోగ్రఫీ అని కొనియాడారు. సాంకేతికత ఎంత మారినా, ఫోటోగ్రాఫర్ల శ్రమ, కళాత్మక దృష్టి సమాజానికి ఎల్లప్పుడూ ప్రత్యేకమైనవేనని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఫోటోగ్రాఫర్లందరూ ఐక్యతతో మెలుగుతూ, వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని వివిధ ఫోటో స్టూడియోల యజమానులు, సీనియర్, జూనియర్ ఫోటోగ్రాఫర్లు, ప్రెస్ ఫోటోగ్రాఫర్లు, పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# ఎన్ఎస్పీ కాలువ ఆధునికీకరణ పనులు

**పరిశీలించిన ఎమ్మెల్యే ఏలూరి**

**రూ.2.50 కోట్లతో జోరుగా పనులు**

**బొల్లాపల్లి మేజర్ పై పనుల పరిశీలన**





**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, ఆగస్టు 19)**

ఎన్ఎస్పీ కాలువ ఆధునికీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బొల్లాపల్లి మేజర్‌పై జరుగుతున్న పనులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పరిశీలించారు. రూ.2.50 కోట్ల వ్యయంతో చేపట్టిన ఆధునికీకరణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించడం, పిచ్చి మొక్కలను తొలగించడం, గుర్రపు డెక్కను తొలగించడం, డ్రాఫ్ట్‌ల మరమ్మతులు చేపట్టడం, కాలువ కట్టలను బలోపేతం చేయడం తదితర పనులు జరుగుతున్నట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. కాలువలో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా పూడిక, గుర్రపు డెక్క, ఇతర వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించాలని ఎమ్మెల్యే సూచించారు. కాలువ కట్టలు బలంగా ఉండేలా అవసరమైన మరమ్మతులు చేపట్టి, భవిష్యత్తులో గండ్లు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డ్రాఫ్ట్‌ల మరమ్మతులు, ఇతర నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. ఎన్ఎస్పీ కాలువల ఆధునికీకరణతో నీటి ప్రవాహ సామర్థ్యం పెరిగి ఆయకట్టు చివరి భూములకు సైతం సాగునీరు సక్రమంగా అందే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, రైతులకు ప్రయోజనం చేకూరేలా పనులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం

## జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 19)**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాలో అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతాకు వివరించారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా సంబంధిత పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖల కమిషనర్లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జెడ్పీ సీఈవోలు, డీపీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కడప కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పాల్గొనగా.. కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్ నుంచి డీఆర్వో కె. మల్లికార్జునుడు, జెడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, డీపీవో రామచంద్ర, కేఎంసీ కమిషనర్ భవానీప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్.. అన్ని జిల్లాల కలెక్టర్ లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో అన్ని రకాల ఏర్పాట్లను ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. ఓటర్ల జాబితాల పరిశీలన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎన్నికల సిబ్బంది సమీకరణ, శిక్షణ, ఎన్నికల సామగ్రి తదితర అంశాలపై అధికారులు చేపడుతున్న చర్యలను వివరించారు. గతంలో గ్రామ పంచాయతీ, జెడ్పిటిసి, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల విజయవంతానికి ఏ విధంగా కృషి చేశారో అదే స్ఫూర్తితో ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికలను కూడా పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా, పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలోని 39 మండలాల పరిధిలో 619 గ్రామపంచాయతీలు, 6,004 వార్డులు ఉన్నాయని, మొత్తం 11,84,815 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికలు నిర్వహించని 8 గ్రామపంచాయతీలకు సంబంధించి న్యాయస్థానాల ఉత్తర్వులు, ఎన్నికల బహిష్కరణ తదితర అంశాలను కూడా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియ క్షేత్రస్థాయిలో కొనసాగుతోందని, ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను ఆగస్టు 23న, తుది జాబితాను ఆగస్టు 31న ప్రచురించేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన కాలపట్టిక ప్రకారం నిర్వహిస్తున్నామని, ఇంటింటి సర్వే ఆగస్టు 18 నుంచి 22 వరకు, ఓటర్ల గుర్తింపు, ముసాయిదా జాబితా ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ, విచారణ అనంతరం గ్రామసభల ద్వారా జాబితాల ధ్రువీకరణ చేపట్టి సెప్టెంబర్ 7న తుది జాబితాలను ప్రచురించేలా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన బ్యాలెట్ పెట్టెలు, బ్యాలెట్ పత్రాల ముద్రణకు కావాల్సిన కాగితం, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై కూడా ముందస్తు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సిద్ధంగా ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.



# గ్రామాల్లో పొలం పిలుస్తుంది

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 19)**



మండలంలోని సూదనగుంట , తుమ్మగుంట గ్రామాల నందు బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు నాట్లు వేస్తున్న మిరప పంటను పరిశీలించి, నాటు వేసే ముందు ముఖ్యంగా నర్సరీల వద్ద మొక్కలు కొనుగోలు సమయంలో రసీదులు తప్పనిసరిగా తీసుకొని మాత్రమే సాగు చెయ్యాలని రైతులకు తెలియచేసారు. అదే విధంగా మొక్క పెరుగు దళ సమయంలో పూత, కాయ దశల్లో తామర పురుగు, పచ్చ పురుగు, లద్దెపురుగు నివారణకు తీసుకోవాలిసిన చర్యలు, కలుపు, నీరు, ఎరువులు యాజమాన్య పద్ధతులు గురించి తెలియజేయడం జరిగింది. పస్తుతం పెరుగుతున్న సాగుఖర్చులు రసాయన ఎరువులు వాడకం వల్ల నేల సారం తగ్గిపోతున్న నేపథ్యంలో రైతులంతా పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంని కూడా అలవాటు చేసుకోవాలని తెలియజేశారు. ఈ విధానంలో సాగు చేయటానికి ముందుకు వచ్చే రైతులకు ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది ఎల్లవేళలా అండగా ఉండి పూర్తి సాంకేతిక సమాచారం సహకారం అందిస్తారని చెప్పారు. రసాయనిక ఎరువులపై ఖర్చు తగ్గించి సేంద్రియ పద్దతిలో కేవలం ఆవు పేడ, మూత్రము వేప తదితర ప్రకృతి సిద్ధమైన వనరులతో పురుగు మరియు తెగుళ్ళ నివారణకు అవసరమైన కషాయాలను ఎలా తయారు చేసుకోవాలో సిబ్బంది స్వయంగా చేసి చూపిస్తారని చెప్పారు. ఆ కషాయాలను రైతులు చేతనే నేరుగా పంటలపై పిచికారి చేయించి ప్రాథమిక అవగాహన కల్పిస్తామన్నారు. ఈ వినూత వ్యవసాయం పట్ల ఆసక్తి ఉన్న రైతులు తక్షణమే తమ పేర్లు స్థానిక ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వద్ద నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపిఓ పాల్గొని సన్న, చిన్న కారు రైతులు ఉద్యాన పంటలయిన నిమ్మ, మామిడి, దానిమ్మ సాగుకు ముందుకు రావాలని ఆ సాగుకు కావలసిన ప్రోత్సహకాలు ప్రభుత్వం కల్పిస్తుందని కావున ఆసక్తి కల రైతులు మమ్మల్ని సంప్రదించి వినియోగించు కోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యానవనసహాయకులు, ఆ గ్రామ రైతులు పాల్గొన్నారు.



# వైయస్ జగన్‌ను కలిసిన శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ తూమాటి మాధవరావు

## తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపిన మాధవరావు

**(షణ్ముఖ వెలుగు, తాడేపల్లి, ఆగస్టు 19)**

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్‌గా తనకు అవకాశం కల్పించినందుకు వైయస్ జగన్‌కు మాధవరావు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పదవికి వన్నె తెచ్చేలా బాధ్యతలను నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మాధవరావు తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ వైయస్ జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన మాధవరావును వైయస్ జగన్ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైఎస్సార్‌సీపీకి చెందిన శాసనమండలి సభ్యులు కూడా ఈ సందర్భంగా వైయస్ జగన్‌ను కలిశారు. మండలి డిప్యూటీ ఛైర్మన్‌గా మాధవరావు ఎన్నికైన నేపథ్యంలో ఆయనకు ఎమ్మెల్సీలు అభినందనలు తెలిపారు.

# ఎమ్మెల్యే ఏలూరి కృషితో రహదారికి రాచబాట మార్టూరు-గన్నవరం రహదారికి మహర్దశ

**రూ.5.50 కోట్లతో మార్టూరు-పెద్దజాగర్లమూడి-పూరిమెట్ల రహదారి నిర్మాణం**

**వేగంగా సాగుతున్న బీటీ రోడ్డు పనులు**

**ఏళ్ల నిరీక్షణకు తెర**

**మార్టూరు, యనమదల, గన్నవరం, బొబ్బేపల్లి ప్రజల్లో హర్షం**



**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, ఆగస్టు 19)**

ఏళ్ల తరబడి అధ్వానంగా మారి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన మార్టూరు-గన్నవరం రహదారికి మహర్దశ పట్టింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషితో రూ.5.50 కోట్ల నిధులతో మార్టూరు-పెద్దజాగర్లమూడి-పూరిమెట్ల మీదుగా మార్టూరు, గన్నవరం బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. దీంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల రహదారి సమస్యకు పరిష్కారం లభించనుంది.

**ఏళ్ల నిరీక్షణకు తెర...** మార్టూరు, యనమదల, యద్దనపూడి జాగర్లమూడి,బొబ్బేపల్లి, గన్నవరం,పూనూరు తదితర గ్రామాలకు ఈ రహదారి కీలకమైన రవాణా మార్గం. రహదారి దెబ్బతినడంతో గుంతలు, దుమ్ము, బురదతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వానంగా ఉండేది. రహదారి నిర్మాణం కోసం స్థానికులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు.

**ఏలూరి కృషితో రూ.5.50 కోట్ల నిధులు...**

ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రహదారి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ స్థాయిలో చొరవ తీసుకుని రూ.5.50 కోట్ల నిధులు మంజూరు చేయించడంతో రహదారి నిర్మాణానికి మార్గం సుగమమైంది. ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతుండటంతో ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**రహదారికి రాచబాట...**

కొత్త బీటీ రహదారి నిర్మాణంతో మార్టూరు నుంచి గన్నవరం వరకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. రైతులు తమ పంటలను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు నిత్యం రాకపోకలు సాగించేందుకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. రహదారి అభివృద్ధి ఈ ప్రాంత ఆర్థిక, సామాజిక ప్రగతికి దోహదపడనుంది.

**ప్రజల్లో ఆనందం...**

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రహదారి నిర్మాణం ప్రారంభమై పనులు వేగంగా జరుగుతుండటంపై మార్టూరు, యనమదల, గన్నవరం, బొబ్బేపల్లి గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను గుర్తించి రహదారి అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.రహదారి పూర్తయితే తమ ప్రాంతానికి అభివృద్ధి రాచబాట పడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఆగిపోతున్న గుండె పై ఆశల సంతకం నిరుపేద తల్లి ప్రాణం నిలిపిన ఏలూరి



(షణ్ముఖ వెలుగు, యద్దనపూడి, ఆగస్టు 19)

నిశ్శబ్దం కంటే భయంకరమైనది. రేపు మనకు నూరేళ్ళు నిండుతాయేమో అన్న మృత్యు భయం. యద్దనపూడి మండలం అనంతవరం గ్రామానికి చెందిన నిరుపేద మహిళ అయిన రావి రమాదేవి ఇంట్లో కొన్ని రోజులుగా ఆ భయమే తాండవించిది. గుండె గదుల్లో మొదలైన నెప్పులు ఆ కుటుంబాన్ని కోలుకొని ఆవేదనలోకి నెట్టాయి. పరీక్షించిన వైద్యులు వెంటనే గుండె అత్యవసర చికిత్స చేయాలి...లేకుంటే ప్రమాదమని తేల్చి చెప్పారు. కానీ ఆ నిరుపేద కుటుంబానికి అంత పెద్ద మొత్తం డబ్బులు ఎక్కడివి?లక్షల రూపాయల ఖర్చు అనే మాట వినగానే ఆ పేద తల్లి గుండె ఆగినంత పని అయినది. అప్పు పుట్టే దారి లేదు,ఆపరేషను ఆగే పరిస్తితి కాదు.కళ్ల ముందే ప్రాణం కొట్టుమిట్టాడు తుంటే ఆ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అయ్యారు. పదవులు ఆశించకుండా, పగలు, రేయి అనకుండా ఊరిలో ఎవరికి ఏ ఆపద వచ్చినా, సమస్య ఎక్కడున్నా వాలిపోయి, వారికి పెద్ద దిక్కుగా మారిపోయి సమాచారాన్ని ఎమ్మెల్యే ఏలూరికి చేరవేసే ఏలూరి సైన్యం సమస్య తీవ్రతను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకువెళ్ళారు. సమస్య తీవ్రతను తెలుసుకున్న ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో వైద్య ఖర్చుల కోసం డబ్బులు లేక ఏ ఒక్క కుటుంబమూ ఇబ్బంది పడకుడదని భావించి ఆయన యుద్ధ ప్రాతిపదికన కదిలారు. తన కార్యాలయ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించి రికార్డు సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.2,01,480ల ఎల్వోసి కాగితాన్ని తెప్పించి ఆ బాధిత కుటుంబం చేతిలో తన కార్యకర్తల ద్వారా పెట్టించారు.ఆ కాగితం ముక్క కేవలం ఒక హామీ పత్రం కాదు. ఆగిపోతున్న ఒక నిరుపేద తల్లి ప్రాణాన్ని నిలిపే ఒక సంజీవని. రమాదేవి కుటుంబానికి కొండంత అండ. ఆపదలో తమ కుటుంబాన్ని వెంటనే ఆదుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమస్యను తెలుసుకొని సాయమందించుటలో తోడ్పడిన కార్యకర్తలు నిండు నూరేళ్లూ చల్లగా ఉండాలని రావి రమాదేవి కుంటుంబం దీవించింది.

# పొగాకు బోర్డులో రిజిస్టర్ కాబడిన రైతులే పంట సాగు చేయాలి



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఆగస్టు 19)

మండల కేంద్రమైన పొన్నలూరులో బుధవారం 26వ వేలంకేంద్రం ఆధ్వర్యంలో పొగాకు రైతులకు సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా ఫీల్డ్ అసిస్టెంట్ ప్రత్యూష మాట్లాడుతూ పొగాకు బోర్డులో రిజిస్టర్ కాబడిన రైతుల మాత్రమే పొగాకు సాగు చేపట్టాలని, రిజిస్టర్ కానీ రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ పొగాకు పంట సాగు చేయవద్దని రైతులకు తెలిపారు. రైతులు తమ కేటాయించిన కోటా మేరకే పండించాలని, అధిక విస్తరణంలో పండించకూడదని వారికి సూచించారు, బ్యారన్ వక్కింటికి 21 కింటాలు మాత్రమే పండించాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టొబాకో ఓ ఎఫ్ ఓ మనీషా, రైతులు పల్లపోతు సురేంద్రబాబు, నేలపాటి మాధవరావు, కల్లూరి చెంచురామయ్య, కంచర్ల రామ్ కుమార్, మండవ కృష్ణారావు, ఆదయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్యూఐఎస్‌సీఈటీలో రక్తదాన శిబిరం 60 మంది విద్యార్థులు, అధ్యాపకుల రక్తదానం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 19)

ఒంగోలులోని క్యూఐఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఒంగోలు రక్తనిధి కేంద్రం సహకారంతో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కళాశాలకు చెందిన 60 మంది విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక సేవలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు. ఈ సందర్భంగా క్యూఐఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్ఎస్ కళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్ గాయత్రి దేవి రక్తదాతలను అభినందించి, వారి సేవా భావాన్ని ప్రశంసించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. యువత సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొనాలని వారు ఆకాంక్షించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఒంగోలు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సందీప్ శ్రీనివాస్ శిబిరంలో పాల్గొని రక్తదానం ప్రాధాన్యతను వివరించారు. ఒక యూనిట్ రక్తం అనేక మంది ప్రాణాలను కాపాడగలదని, ఆరోగ్యవంతులైన యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ జి నవనీతకృష్ణన్, డీన్ ఎన్ఎస్ఎస్ సమన్వయం చేశారు. క్యూఐఎస్‌సీఈటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి హనుమంతరావు మార్గదర్శకత్వంలో శిబిరం విజయవంతంగా నిర్వహించారు. రక్తదాన శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రక్తనిధి సిబ్బందికి, స్వచ్ఛంద రక్తదాతలైన విద్యార్థులు, అధ్యాపకులకు ఎన్ఎస్ఎస్ యూనిట్ కృతజ్ఞతలు తెలిపింది.









# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు రాజకీయ సాధికారతకు చారిత్రాత్మక అడుగు



**వెనుకబడిన వర్గాల రక్షణకు బీసీల ప్రత్యేక రక్షణ చట్టం అములులోకి తెచ్చేందుకు కృషి**

**ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 19)

2024 ఎన్నికల సమయంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు దిశగా తీసుకున్న నిర్ణయం అభినందనీయమని ఒంగోలు పార్లమెంటు టిడిపి ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు పేర్కొన్నారు.ఒంగోలు రామ్ నగర్ 2వ లైన్ లోని పార్లమెంట్ టిడిపి కార్యాలయం నందు బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొఠారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరిగి 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం బీసీల రాజకీయ సాధికారతకు చారిత్రాత్మక అడుగని తెలిపారు. ఇది కేవలం ఎన్నికల హామీని నిలబెట్టుకోవడం మాత్రమే కాకుండా, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యంపై తెలుగుదేశం పార్టీకి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తోందని, స్వర్గీయ నందమూరి తారక రామారావు హయాంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించి బలమైన పునాది వేశారని గుర్తు చేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేశారని, అలాగే బీసీ వర్గాల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని అములులోకి తెచ్చే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.గత ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల బీసీలకు రాజకీయంగా నష్టం జరిగిందని, ఇప్పుడు తిరిగి 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా బీసీలకు న్యాయం జరిగిందని అన్నారు.బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం, రాజకీయ సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనా విధానం, రాజకీయ సిద్ధాంతం. బీసీలకు రాజకీయంగా ఎదిగే అవకాశాలు కల్పించడం, వారి నాయకత్వాన్ని ప్రోత్సహించడం తెలుగుదేశం పార్టీ విధానంలో అంతర్భాగంగా కొనసాగుతోందని తెలిపారు.ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి అధ్యక్షతన త్వరలో ఒంగోలు పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో బీసీ సోదరుల ఆధ్వర్యంలో కలిసికట్టుగా బీసీల ప్రచార కార్యక్రమాన్ని మరియు కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరుగుతుందని తెలిపారు.బీసీ సోదరులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ముందుకు సాగాలని విజ్ఞప్తి చేస్తూ ఒంగోలు పార్లమెంట్ బిసి సోదర సోదరీమణుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీలకు రాజకీయ సాధికారత, సామాజిక గౌరవం, ఆర్థిక అభివృద్ధి, సముచిత ప్రాతినిధ్యం కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి బలహీన వర్గాల ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి తంజావూరి శ్రీనివాసమూర్తి, యాసారపు ఏడుకొండలు, ఎల్లటూరి వేణు, మండపల్లి శ్రీనివాసరావు, తదితర బీసీ సోదరులు పాల్గొన్నారు.

# బీసీలకు 34% రిజర్వేషన్

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 19)

ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు బీసీలకు 34% రిజర్వేషన్ కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ కనిగిరి పట్టణంలోని సుగుణమ్మ హాస్పిటల్ సెంటర్ వద్ద ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# అసెంబ్లీని సందర్శించిన బాలికొన్న పాఠశాల విద్యార్థినులు





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 19)

కనిగిరి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు బుధవారం ఆంధ్రుల రాజధాని అమరావతి లోని అసెంబ్లీని సందర్శించారు. రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులు పాఠశాలకు 30 మంది వంతున ఈ నెల 17 నుండి 20 వరకు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన వచ్చు అని అసెంబ్లీ స్పీకర్ ప్రకటించారు. ఈ మేరకు కనిగిరి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు 30 మంది కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో అసెంబ్లీ అనుమతి పాస్‌లు పొంది బుధవారం ఉదయం హాజరయ్యారు. అసెంబ్లీ సందర్శనకు విచ్చేసిన విద్యార్థులతో అసెంబ్లీ ఆవరణలో కొంత సమయం మమేకమై, వారితో ఆప్యాయంగా మాట్లాడిన ఉగ్ర నరసింహారెడ్డి, గౌరవ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో కలిసి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం టిడిపి ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అసెంబ్లీ కార్యక్రమాలు, ప్రజాస్వామ్య వ్యవస్థ మరియు శాసనసభ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు మరియు సామాజిక బాధ్యతను పెంపొందించే ఇలాంటి సందర్శనలు ఎంతో ప్రేరణనిస్తాయని పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు కలవ విజయ లక్ష్మి తెలిపారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు అవులమందా వెంకట నారాయణ, లక్ష్మి నరసమ్మ, అలివేలమ్మ, సత్య గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల పంపిణీ రుణాల పై అసెంబ్లీలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రస్తావన



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 19)

కడప జిల్లాలో గొర్రెల పంపిణీ సంఘాలకు సంబంధించిన రుణాల వ్యవహారంపై మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ గారు ఈరోజు శాసనసభలో జీరో అవర్‌లో ప్రస్తావించారు. కడప జిల్లాలో సుమారు 75 ప్రాథమిక గొర్రెల పంపిణీ సంఘాలు ఉండగా, వాటి పరిధిలో సుమారు 600 మంది సభ్యులు ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. చీజణజ సబ్సిడీ పథకం కింద ఒక్కో లబ్ధిదారుడికి సుమారు రూ.2.80 లక్షల రుణం మంజూరు చేసినట్లు సమాచారం ఉందని, అయితే కొంతమంది లబ్ధిదారులకు కేవలం రూ.30,000 మాత్రమే అందించారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం కొంతమంది లబ్ధిదారులు వడ్డీతో కలిపి రూ.1,02,000 చెల్లించాలని కోరుతున్నారని, మరోవైపు కొంతమంది సభ్యులకు మాత్రమే రుణాలు అందించి, అర్హులైన మిగిలిన సభ్యులకు రుణాలు అందలేదనే ఫిర్యాదులు ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎంతమంది సభ్యులకు రుణాలు మంజూరు చేశారు, ఎంతమందికి వాస్తవంగా రుణాలు అందించారు. ఎంత మొత్తం విడుదల చేశారు. లబ్ధిదారుల ఖాతాల్లో ఎంత మొత్తం జమ చేశారు. సబ్సిడీ కింద ఎంత మొత్తం అందింది అనే పూర్తి వివరాల పై సమగ్ర విచారణ జరిపించాలని ఎమ్మెల్యే కోరారు. రుణాల మంజూరు, సబ్సిడీ, లబ్ధిదారులకు జరిగిన చెల్లింపుల పై పూర్తి పారదర్శకత తీసుకురావడంతో పాటు, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అసెంబ్లీలో కోరారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

## గంజాయి నిర్మూలనకు ప్రొద్దుటూరు వన్ టౌన్ సీఐ కొండారెడ్డి వ్యూహాత్మక అడుగులు

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో
పెన్నా నగర్‌లో భారీ అవగాహన సదస్సు
ఈగల్ టీమ్‌తో కలిసి రంగంలోకి
దిగిన సీఐ వెంకట కొండారెడ్డి
మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా కఠిన చర్యలు






(షణ్ముఖ వెలుగు, ప్రొద్దుటూరు, ఆగస్టు 19)

వైఎస్ఆర్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పిలుపు మేరకు ప్రొద్దుటూరు పట్టణంలో గంజాయి, మాదకద్రవ్యాల మూలాలను మట్టుబెట్టడమే లక్ష్యంగా వన్ టౌన్ సీఐ వెంకట కొండారెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా గురువారం ప్రొద్దుటూరులోని పెన్నా నగర్ ప్రాంతంలో 'ఈగల్ టీమ్' సభ్యులతో కలిసి ఆయన విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజానికి శాపంగా మారిన గంజాయి, మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు సీఐ కొండారెడ్డి ముందుండి నడుస్తున్నారు. స్వయంగా ప్రజల వద్దకు వెళ్తూ, ముఖ్యంగా యువత దారితప్పకుండా ఉండేందుకు చైతన్య కార్యక్రమాలు చేపడుతూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు.

యువత భవిష్యత్తు నాశనం కావొద్దు :

సీఐ వెంకట కొండారెడ్డి మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్య అలవాట్లు వ్యక్తిగత జీవితాలనే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని నాశనం చేస్తాయి. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు యువత భవిష్యత్తును చీకట్లోకి నెడుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలి" అని సూచించారు. పట్టణంలో గంజాయి అమ్మకాలు, అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా భయం లేకుండా వెంటనే వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా రహస్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. మత్తుపదార్థాలు లేని, సమగ్రమైన ప్రొద్దుటూరును నిర్మించడంలో ప్రతి ఒక్క పౌరుడు, యువత, స్థానిక నాయకులు పోలీసు శాఖకు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈగల్ టీమ్ సభ్యులు, వన్ టౌన్ సిబ్బంది, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సీఐ కొండారెడ్డి తీసుకుంటున్న ఈ చొరవపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా తగిన ప్రణాళికలు రూపొందించాలి

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 19)

కడప, మైదుకూరు, రాజంపేట సబ్ డివిజన్ల నేర సమీక్షా సమావేశంలో పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ దిశా నిర్దేశం చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు వీలుగా ఇప్పటినుండే తగిన ప్రణాళికలు రూపొందించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కడప, మైదుకూరు, రాజంపేట సబ్ డివిజన్ల నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా ట్రబుల్ మాంగర్లపై, ఎన్నికల నేరాలకు పాల్పడినవారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా భద్రత కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఈవ్ టీజింగ్, మహిళలు, చిన్నారులపై నేరాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, డ్రగ్స్ పై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్.పి సూచించారు. మైనర్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసే వారిపై ఎం.వి యాక్ట్ మేరకు కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ కు అంతరాయం కలిగేలా రోడ్లపై అడ్డంగా వాహనాలు నిలిపి ఉంచితే సీజ్ చేసి స్టేషన్ కు తరలించాలని, జరిమానా విధించాలని ఆదేశించారు.

# దాల్మియా ప్రభావిత గ్రామస్తుల పరిహారం, పునరావాసం, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి
### సంస్థ యాజమాన్యం, రెవెన్యూ అధికారులతో సమావేశం





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 19)

దాల్మియా పరిశ్రమ ప్రభావిత గ్రామాల ప్రజలకు ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నిబంధనల మేరకు అమలు చేసి, వారికి పూర్తి న్యాయం జరిగేలా చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను, దాల్మియా సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనాతో కలిసి దాల్మియా సంస్థ యాజమాన్య ప్రతినిధులు, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గత ఏడాది నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఇచ్చిన హామీలు, తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిని అంశాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. బాధిత ప్రజలకు అందాల్సిన పరిహారం, పునరావాస చర్యలు, అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఇటీవల జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం చిన్నకొమర్లలోని దాల్మియా సిమెంట్ పరిశ్రమను సందర్శించిన అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, యువ నాయకుడు భూపేష్ రెడ్డితో కలిసి సమీపంలోని దుగ్గనపల్లె ఆలయం వద్ద ప్రభావిత గ్రామాల ప్రజలతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలను వివరించడంతో, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. దుగ్గనపల్లి గ్రామ పునరావాసానికి ఇప్పటికే స్థల పరిశీలన పూర్తయిందని ఆర్డీవో శిరీష తెలిపారు. చిన్నకొమెర్ల గ్రామంలో సుమారు 10 ఎకరాల స్థలాన్ని గుర్తించి, 60 కుటుంబాలకు వసతి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. గండికోట రిజర్వాయర్ నిర్వాసితులకు అందించిన విధానంలోనే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పరిహారం అందించేందుకు అంగీకారం కుదిరిందని తెలిపారు. పునరావాస ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమ కాంపౌండ్ వాల్ కారణంగా వర్షాలు, వరదల సమయంలో సహజ నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడి వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయన్న ఫిర్యాదులపై కూడా సమీక్షించారు. సమస్య పరిష్కారానికి వంకను విస్తరించాలని నిర్ణయించి, అంచనా వ్యయాన్ని సిద్ధం చేసి పనులను సాగునీటి శాఖకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. పరిశ్రమల నుంచి వెలువడే దుమ్ముతో పంటలు దెబ్బతింటున్న నేపథ్యంలో ప్రభావిత రైతులకు రాబోయే పంట కాలానికి ఎకరాకు రూ.10 వేల ఇన్‌పుట్ సబ్సిడీ అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అవసరాన్ని బట్టి విత్తనాలు, ఎరువుల రూపంలో కూడా సహాయం అందించేలా ప్రక్రియ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. నవాబ్‌పేట ప్రాంతంలో మైనింగ్, బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లు దెబ్బతింటున్నాయన్న ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలనతో సమగ్ర సర్వే నిర్వహించి నష్టాన్ని అంచనా వేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల పురోగతిపైనా సమీక్షించారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. పునరావాసం, పరిహారం, వంక విస్తరణ, పంట నష్టానికి సహాయం, దెబ్బతిన్న ఇళ్ల సర్వే తదితర చర్యలను వేగవంతం చేసి ప్రభావిత గ్రామాల ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జమ్మలమడుగు ఆర్డీవో శిరీష, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సుధ, హౌసింగ్ పీడి రాజారత్నం, రెవెన్యూ అధికారులు, దాల్మియా సంస్థ యాజమాన్య ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఒంగోలులో ఘనంగా స్మాల్, మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రథమ మహాసభ

### సీనియర్ జర్నలిస్టులకు శాలువాలు, జ్ఞాపికలతో ఘన సత్కారం
### నూతన జిల్లా కమిటీ ఎన్నిక - అధ్యక్షుడిగా షేక్ కాలేషా వలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 19)

స్మాల్, మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులోని మౌర్య ఇన్ వేదికగా ప్రకాశం జిల్లా ప్రథమ మహాసభ అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీఎంఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి ఢిల్లీ బాబు రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ ప్రథమ మహాసభకు ఉడా చైర్మన్ షేక్ రియాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బి జవహర్, లయన్స్ క్లబ్ గవర్నర్ రావిపాటి లక్ష్మీనారాయణ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు ఒంగోలు గెలాక్సీ గ్రెనైట్ అధినేత చలువాది బదరి నారాయణ, సుదర్శన్ గ్రెనైట్ నూనే సుబ్రహ్మణ్యం, నూనే హేమసుందరరావు, ఎస్వి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాళ్లపారి నర్సింహారావు, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్ అసోసియేషన్ రాష్ట్ర అక్రిడేషన్ కమిటీ మెంబర్ డి ఉదయ భాస్కర్ హాజరయ్యారు. జర్నలిస్ట్ సంఘాల నాయకులైన ఏపీఎంబీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి మద్దిలేటి, కర్నూలు జిల్లా కన్వీనర్ ఎం సాయి కుమార్ నాయుడు, నంద్యాల జిల్లా కోకన్వీనర్లు పి శివకుమార్‌రెడ్డి, శివకుమార్ నాయుడు తదితరులు గౌరవ అతిథులుగా విచ్చేశారు. సమాజ హితమే ధ్యేయంగా వార్తలు అందిస్తూ దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సీనియర్ జర్నలిస్టులను ఈ వేదిక పై ప్రజా ప్రతినిధులు, నాయకులు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు.



సత్కారం పొందిన సీనియర్ పాత్రికేయులు:

పెట్లూరి వెంకటేశ్వరరావు, శిఖాకొల్లి శ్రీనివాసరావు, కొమ్మూరి శ్రీనివాసరావు, ఇష్తేకార్ భాషా, బెల్లం అనిల్ కుమార్, ఎంవి రమణారావు, షణ్ముఖ వెలుగు దిన పత్రిక ఫోటో గ్రాఫర్ ఉబ్బా అశోక్, ఎంవిఎస్ శాస్త్రి, కన్నెదార హరి, అడగబొట్టు సుబ్బారావు, వీరితో పాటు పలువురు సీనియర్ ఫోటోగ్రాఫర్లు, కెమెరామెన్లు, వివిధ యూనియన్ నాయకులను కూడా వేదిక పై శాలువా కప్పి సన్మానించారు. ఈ మహాసభ ముగింపు సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి ఢిల్లీ బాబు రెడ్డి ప్రకాశం జిల్లా నూతన కమిటీని అధికారికంగా ప్రకటించారు.

నూతన కమిటీ ఇదే....అధ్యక్షుడిగా షేక్ కాలేషా వలి, ప్రధాన కార్యదర్శిగా టి శైలజ, ఉపాధ్యక్షులుగా జంకారా ఏడుకొండలు, నూతలపాటి మల్లికార్జున కోశాధికారిగా సతీష్, ఈసీ సభ్యులుగా అబ్రహాం, దాసు, కుమారి గీత, రాజశేఖర్, పెద్దినేని సురేంద్ర బాబు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పత్రికల అభివృద్ధికి, జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని తెలియజేశారు. ఈ మహాసభకు జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పాత్రికేయులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కౌలు రైతుకు ప్రమాదం...

### నొప్పి కంటే ఆర్థిక భారమే పెద్ద కష్టం
### రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం
### ఎమ్మెల్యే ఏలూరి చొరవతో అండగా నిలిచిన ముఖ్యమంత్రి సహాయనిధి

(షణ్ముఖ వెలుగు, యద్దనపూడి, ఆగస్టు 19)

కష్టపడి కౌలుకు వ్యవసాయం చేసుకుంటూ, రెక్కాడితేగానీ డొక్కాడని బతుకు వెళ్లదీస్తున్న యద్దనపూడి గ్రామానికి చెందిన పల్లెపోగు హనోకుకు రోడ్డు ప్రమాదం పెద్ద కుదుపునిచ్చింది. ఎడమచేయి పూర్తిగా విరిగిపోవడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, రోజువారీ కూలీపైనే ఆధారపడి జీవించే ఆ నిరుపేద కుటుంబానికి వైద్యఖర్చులు భరించడం అంత తేలికైన విషయం కాదు. కుటుంబ పెద్ద మంచానికే పరిమితం కావడంతో, ఇంటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

నేతల ద్వారా ఎమ్మెల్యే దృష్టికి... వెంటనే స్పందన

కుటుంబ దీనావస్థను గమనించిన స్థానిక నాయకులు, బాధితుడి తరఫున ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును ఆశ్రయించారు. పేద కుటుంబ కష్టాన్ని విన్న వెంటనే ఎమ్మెల్యే ఏలూరి స్పందించి, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆదుకునేందుకు తక్షణమే చర్యలు చేపట్టారు. తన లేఖతో పాటు అవసరమైన పత్రాలను తన క్యాంపు కార్యాలయం నుంచి నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించి, (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు కోసం ప్రత్యేక చొరవ చూపారు.

రూ.75,000 సాయం మంజూరు
గుంటూరు ఆస్పత్రికి నేరుగా చెక్కు

దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించి, గుంటూరులోని కిమ్స్ శిఖర ఆస్పత్రిలో హనోకుకు వైద్యం అందించేందుకు రూ.75,000 ల మేర ఎల్‌ఓసీని మంజూరు చేసింది.

కుటుంబంలో ఆనందం...ఎమ్మెల్యే సాంబన్నకు కృతజ్ఞతలు

ఊహించని ఈ సాయంతో పల్లెపోగు హనోకు కుటుంబం కంటతడి పెట్టుకుంది. "చేయి విరిగిందని బెంబేలెత్తిపోయాం. వైద్యం ఖర్చు ఎలా భరించాలో తెలియలేదు. ఎమ్మెల్యే ఏలూరి మాకు అండగా నిలిచారు" అని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పేదల కష్టాలను ఎప్పటికప్పుడు గుర్తించి, తక్షణమే స్పందించే విధానంతో పర్చూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సేవలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి.